
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 03.04.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 44 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## చంద్రబాబు పాలనలో

# చినబాబు "రాజ్యం"




**రాష్ట్రాన్ని ఇప్పుడు ఎవరు పరిపాలిస్తున్నారు? చంద్రబాబా? లేక లోకేష్ అనబడే చిన్నబాబా? ఇప్పుడిది మిలియన్ డాలర్ల ప్రశ్న? రాష్ట్రానికి అధికారికంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అయినా ప్రభుత్వంలోని కీలక నిర్ణయాలన్నీ కూడా లోకేష్‌బాబు కనుసైగలతోనే జరుగుతున్నాయనేది దీనికి సమాధానం.**

భారత రాజకీయాలలో కుటుంబ వారసత్వం జవహర్‌లాల్ నెహ్రూ కుటుంబం నుండే మొదలైంది. అది దేశంలోని ప్రతి రాజకీయ కుటుంబానికి పాకింది. ఈ వారసత్వ రాజకీయాలకు చంద్రబాబు అనర్హుడు. అతీతుడు కాదు. తెలుగుదేశం ప్రాంతీయ పార్టీ. 1995లో ఎన్టీఆర్ చేతుల్లో నుండి చంద్రబాబు చేతుల్లోకి వచ్చింది. ఈ పార్టీని ఇంకొకరి చేతుల్లో పెట్టేంత అమాయకుడు కాదు చంద్రబాబు. తన తర్వాత తన కొడుకే ఈ పార్టీని చూసుకోవాలనేది ఆయన ఆలోచన. దేశంలో ఏ ప్రాంతీయపార్టీ నాయకులైనా ఇదే విధంగా ఆలోచిస్తున్నారు. బీజేపీ, వామపక్షాలు వంటి అరకొర పార్టీలలో తప్పితే కాంగ్రెస్‌ను మొదలుకొని మిగతా అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలలో రాజకీయ వారసత్వ సంస్కృతి కొనసాగుతూనే వుంది. ఈ సంస్కృతే ఇప్పుఢు తెలుగుదేశంలోనూ వుంది. చంద్రబాబుకు వయసు పైబడుతుంది. ఇప్పుడున్న ఓపిక, ఉత్సాహం ఇంకో నాలుగేళ్ల తర్వాత ఉండకపోవచ్చు. తెర వెనుక చక్రం తిప్పే పనులకు పరిమితం కావచ్చు. లేదంటే జాతీయ రాజకీయాల లోకి వెళ్లవచ్చు. ఈలోపు లోకేష్‌కు రాజకీయ శిక్షణ ఇవ్వాలి. ఇప్పుడు చంద్రబాబు అదే చేస్తున్నాడు.

వాస్తవానికి 2009ఎన్నికల్లోనే లోకేష్‌ను దించారు. ఆరోజు చంద్రబాబు ఓట్ల కోసం విసిరిన నగదు బదిలీ పథకం కూడా లోకేష్ ఆలోచనలో నుండి వచ్చినదే! ఆరోజు వై.యస్. ఇమేజ్ ముందు ఆ వాగ్దానం పనిచేయలేదు. 2014ఎన్నికల్లో లోకేష్ యాక్టివ్‌గా పని చేశాడు. పార్టీ తరపున విస్తృతంగా ప్రచారం (మిగతా 10వ పేజీలో)

# మిస్సయిన మస్తాన్‌బాబు

## • చిలీలో గల్లంతైన నెల్లూరు పర్వతారోహకుడు



**నెల్లూరుజిల్లా పర్వాతారోహకుడు, గిన్నీస్ రికార్డు విజేత, ఎవరెస్ట్‌ను అధిరోహించిన వీరుడు మల్లి మస్తాన్‌బాబు చిలీలోని ఆండీస్ పర్వతాల్లో గల్లంతయ్యాడనే వార్త తెలుగు ప్రజలందరిలోనూ ఆందోళన కలిగిస్తుంది.**

సంగం మండలం గాంధీ గిరిజన సంఘంకు చెందిన మల్లి మస్తాన్‌బాబుకు పర్వతాలను ఎక్కాలంటే మక్కువ. ప్రపంచంలోనే ఎత్తైన పర్వతాలను ఎన్నింటినో ఎక్కి వాటి శిఖరాల మీద భారత పతాకాన్ని (మిగతా 10వ పేజీలో)

విషాదాలు



# బలైన బత్తిబాబు

## • తోటి విద్యార్థులే క్రూరంగా చంపారు
## • జల్సాలే హంతకులను చేసాయి

**ఎక్కడో ఇరాక్, సిరియా వంటి దేశాలలో ఐఎస్ఐఎస్ తీవ్రవాదుల దుశ్చర్యలను టీవీలలో, సోషల్ నెట్‌వర్క్‌లలో చూసి మనుషులలో ఇంత కిరాతకులుంటారా? వీళ్లు మనుషులా, మృగాలా అనుకుంటాం. కాని మృగాలకు మనుషులకు ఒక తేడాను గమనించలేకపోతున్నాం. మృగం సాటి మృగాన్ని ఎప్పుడూ చంపదు. కాని మనిషి సాటి మనిషిని చంపడానికి వెనుకాడడం లేదు. ఎక్కడో వున్న ఐఎస్ఐఎస్ కిరాతకుల గురించి మనం భయపడడం కాదు... అలాంటి వాళ్లు మన మధ్యలో కూడా ఉన్నారన్న విషయం తెలిస్తే ఆందోళన కలగకమానదు.**

ఇది దారుణమనాలో, అమానుషమనాలో, అంతకుమించి ఇంకేమన్నా అనాలో తెలియడం లేదు. వాళ్లను విద్యార్థులనాలో, పిల్లల రూపంలో వున్న రాక్షసులనాలో అర్థం కావడం లేదు. తమ తాగుళ్లకు, తందనాలకు, జల్సాలకు నూరేళ్ల భవిష్యత్ వున్న ఓ విద్యార్థి జీవితాన్ని 17ఏళ్లకే బలి తీసుకున్నారు. తమ జల్సాలకు ఓ తండ్రికి ఓ తల్లికి జీవితాంతం కడుపుకోతను, కన్నీళ్లను మిగిల్చారు. కసాయినైనా కంటతడి పెట్టించి, రాతిగుండెనైనా కరిగించే ఈ అమానుష సంఘటన శాంతికి, ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరులో చోటుచేసుకోవడం నెల్లూరీయులగా మనమంతా సిగ్గు పడాల్సిన విషయం.

నెల్లూరురూరల్ మండలం నరసింహకొండ అటవీ ప్రాంతంలో దారుణహత్యకు గురైన సర్వేయర్ దొడ్డి ఆదినారాయణ కొడుకు బత్తిబాబు(17) హత్య విషయంలో దారుణ వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. తోటి విద్యార్థులే అతనిని కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు గుప్తనిధులు, పూజలు అనే కథలు అల్లారు. అయితే పోలీసుల విచారణలో అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. సర్వేయర్ దొడ్డి ఆదినారాయణ నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని పున్నమి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. సుదీర్ఘకాలంగా సర్వేయర్‌గా పనిచేస్తుండడంతో అందరితో సన్నిహిత సంబంధాలు, మంచిపేరు ఉంది. ఆదినారాయణకు ఒక కూతురు, కొడుకు వున్నారు. కూతూరు డిగ్రీ చదువుతుండగా, కొడుకు బత్తిబాబు నారాయణ కాలేజీలో ఇంటర్ పరీక్షలు హత్యకు గురి కావడానికి మూడురోజుల ముందే వ్రాసాడు. ఆదినారాయణ తన పిల్లలిద్దరినీ ఎంతో క్రమశిక్షణగా పెంచాడు. బత్తిబాబు చిన్నప్పటి నుండి మెతక స్వభావి. తన పనేదో తాను చేసుకుంటూ బుద్ధిగా ఉండేవాడు. ఇంటర్‌లో కూడా ఓ అయిదారు మందితో మాత్రమే (మిగతా 10వ పేజీలో)



## ఉరుముతున్న కరువు...
# పాడిరైతు గుండె చెరువు

- 'గడ్డి కరువు'తో మూగజీవాలు విలవిల!
- ఆవేదనలో మెట్ట రైతాంగం
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం

సింహపురి సమాచారం



'పాడి'ని నమ్ముకున్నవాడికి కూటికి కొదవుండదు.. అని గతంలో పెద్దలు చెప్పేవారు. కానీ, ఇప్పుడా కాలం చెల్లిపోయిందా అనిపిస్తోంది. పాడి పరిశ్రమను నమ్ముకున్న వారికి పాలధారలు కాదు.. కన్నీళ్లే రాలుతున్నాయి. అసలే, జిల్లాలో కరువు మేఘాలు కమ్ముకుంటున్న నేటి పరిస్థితుల్లో, పాడి పెంపకాన్నే జీవనా ధారం చేసుకున్నవారికి నష్టాలే మిగులుతున్నాయి.

ముఖ్యంగా జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు, కలిగిరి, వింజమూరు, కొండాపురం తదితర మెట్ట ప్రాంతాల్లో పాడి పరిశ్రమతో బతుకుతున్న వేలాది రైతు కుటుంబాల జీవితాలు కష్టాల కడగండ్లలో పడి కొట్టుమిట్టాడుతున్నాయి. తీవ్రమైన వర్షాభావంతో, జిల్లాలోని అనేక మండలాల్లో కరువు ఛాయలు అలముకున్నా, పాలకులు కానీ, జిల్లా యంత్రాంగం కానీ పశుపోషణకు ప్రత్యామ్నాయ చర్యలేమీ చేపట్టకపోవడంతో, రైతన్నల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. పశువులకు పచ్చగడ్డి కాదు కదా, ఎండుగడ్డి కూడా లభించని దుర్భర పరిస్థితులున్నా సంబంధిత అధికారులు కానీ, ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. దీంతో, గత కొద్ది నెలలుగా మెట్ట ప్రాంతాల్లో మూగజీవాలకు సరైన మేత లభించక, అనేక ప్రాంతాల్లోని రైతులు తమ పశువులను అత్యంత తక్కువ ధరకే తెగనమ్ముకుంటున్నారు. పశువులకు మేత కూడా పెట్టలేని దయనీయ స్థితిలో, ఆకలికి అల్లాడిపోతూ.. రోజురోజుకీ బక్కచిక్కిపోతున్న ఆ మూగజీవాల దైన్యస్థితిని చూడలేక రైతులు కంటతడిపెడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము ఎంతో ప్రేమగా సాకుతున్న ఆ మూగజీవాలను అందివచ్చిన ధరకి అమ్మేసుకుని, అవి దీనంగా వెళ్ళిపోతుంటే రైతన్నలు గుడ్లనిండా నీరు కుక్కుకుంటున్నారు. అయినా, రైతన్నల పరిస్థితిని పట్టించుకునే నాధులు మాత్రం కనిపించడం లేదు. కరువులో కరుణతో ఆదుకునే వారే కరువయ్యారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన మండలాల్లో ముందు జాగ్రత్తగా పశుగ్రాసానికి కొరత లేకుండా చూడాల్సిన అధికార యంత్రాంగం నిర్లిప్తంగా వుండడంతో రైతులు, పశువుల యజమానుల ఆవేదన వర్ణనాతీతం. పశుగ్రాసాన్ని సబ్సిడీ ధరలకే ఇస్తామని, పశుగ్రాసం కొరత లేకుండా పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేస్తామని ఎప్పటికప్పుడు అధికారులు కంటితుడుపుగా చెప్తుంటారే తప్ప, ఆచరణలో అలాంటివేమీ వుండడం లేదని రైతన్నల ఆవేదన. మెట్ట మండలాల్లోని అనేక ప్రాంతాల్లో పంట పొలాలన్నీ ఎండిపోయి ఎటుచూసినా బీడు భూములే కనిపిస్తున్నాయి. ఎక్కడా నలుసంత గడ్డి కూడా దొరకని దుర్భర పరిస్థితులు అలముకున్నాయి. పోనీ, ఎండుగడ్డి కొందామని ధైర్యం చేసినా, రవాణా ఖర్చులతో కలిపి ఒక ట్రాక్టర్ ఎండుగడ్డి అక్షరాల ఇరవై వేల రూపాయల దాకా పలుకుతోందంటే అతిశయోక్తి కాదు. ఈ కరువుకాలంలో, ఒకవేళ అంత ధర పెట్టి కొందామనుకున్నా ఎండుగడ్డి దొరికేది కూడా గగనంగానే వుందని రైతులు వాపోతున్నారు. పంటలు బాగా పండివుంటే పచ్చగడ్డికీ, ఎండుగడ్డికీ ఇంతగా కొదవ వుండేది కాదు. కానీ, వర్షాలు లేక.. పంటలు పండక ఈ దుస్థితి దాపురించిందని రైతులు ఆవేదనతో చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో, సరైన మేత లేక, పశువులు బక్కచిక్కిపోతుండడంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. జిల్లాలో రోజుకు కనీసం మూడు లక్షల లీటర్ల దాకా వున్న పాల దిగుబడి, దాదాపు సగానికి పైగానే తగ్గిపోయిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థమవుతుంది.. పాడిని నమ్ముకున్న రైతు కష్టాల్లో, నష్టాల్లో మునిగిపోతున్నా అధికారయంత్రాంగం కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడంతో రైతులు నిరాశలో పడిపోతున్నారు.. పాడి పరిశ్రమపై బాగా నిరాసక్తత చూపుతున్నారు.

ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ దుస్థితిని నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మెట్ట ప్రాంతంలోని మండలాల్లో పాడి పరిశ్రమ స్థితిగతులను సమీక్షించి, రైతులకు పశుపోషణకు అవసరమైన పశుగ్రాసాన్ని సత్వరం సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి. మేత లేక అల్లాడిపోతున్న పాడి పశువులను రక్షించాలి. పాడి పశువులున్న ప్రతి రైతన్న ఇంటికీ తక్కువ ధరకు పశుగ్రాసాన్ని సరఫరా చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలి. జిల్లాలో అనువైన భూముల్లో విస్తారంగా పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసి, భవిష్యత్తులో పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా పూర్తిస్థాయిలో శాశ్వత ప్రాతిపదిక చర్యలు తీసుకోవాలి. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలైన రైతన్నలు కంట తడిపెట్టడం మంచిది కాదు. కరువు కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్న పాడిపరిశ్రమను రక్షించేందుకు వెంటనే జిల్లా యంత్రాంగం, పాలకులు, ప్రభుత్వం అందరూ సంయుక్తంగా సమాయత్తం కావాలి. లేకుంటే, జిల్లాలో పాలధారలతో కళకళలాడాల్సిన ఈ పాడి పరిశ్రమ.. ఇక కన్నీటి ధారలతోనే మిగలాల్సివస్తుంది.

## జాతీయ స్థాయి విద్యాసంస్థల శంకుస్థాపనలో
# శ్రీసిటీకి ప్రశంసలు




జాతీయస్థాయి విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటి) చిత్తూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి) తిరుపతి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐయస్ఇఆర్) తిరుపతిలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖామంత్రి స్మృతి ఇరానీ గత నెల 28న శంకుస్థాపన చేశారు. చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు ముప్పవరపు వెంకయ్యనాయుడు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, తిరుపతి ఎంపి వి.ప్రసాద్‌రావు, శ్రీసిటి ఛైర్మన్ శ్రీనిరాజు, యండి రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. చిత్తూరుజిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్, తిరుపతి అర్బన్ ఎస్పీ గోపీనాథ్‌జెట్టి, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి స్మృతి ఇరాని మాట్లాడుతూ మూడు జాతీయస్థాయి విద్యాసంస్థలను రాయలసీమలో ప్రారంభించినందుకు ఆనందపడుతున్నానని, త్వరలో అనంతపురంలో సెంట్రల్ యూనివర్శిటీకి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ శ్రీసిటీ వంటి పెద్ద సెజ్ చిత్తూరులో ఉన్నందుకు జిల్లాకు ఇండస్ట్రియల్ హబ్‌గా పేరొచ్చిందని, ఈ విద్యాసంస్థల వల్ల ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఒకేరోజు, ఒకే ప్రాంతంలో మూడు జాతీయ విద్యాసంస్థలకు భూమిపూజ చేయడం దేశంలో తొలిసారని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అన్నివిధాలా సహకరిస్తుందన్నారు.

శ్రీసిటీ అధినేతలు శ్రీనిరాజు, రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అండదండలతో చిత్తూరుజిల్లా దేశ విదేశ పరిశ్రమలకు కేంద్రబిందువుగా త్వరిత గతిన మారుతుందన్నారు.

## సినీ ఫక్కీలో కారు అపహరణ

సినీ ఫక్కీలో కారును అపహరించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన మస్తాన్‌వలీ బాడుగకు కారు తిప్పుతుంటాడు. మార్చి29వ తేదీ తిరుపతి, కాణిపాకం తదితర ప్రదేశాలకు పోవాలని కారు బాడుగకు కావాలని కానిస్టేబుల్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి చెప్పడంతో కారు తీసుకుని మస్తాన్‌వలి సదరు వ్యక్తిని కారులో ఎక్కించుకుని తిరుపతి బయలుదేరాడు. టోల్‌ప్లాజా దాటగానే తమ బంధువులున్నారంటూ ఈదగాలి సమీపంలోకి రాగానే కారును రోడ్డు పక్కన ఆపించి దిగి ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటించి తనతో తెచ్చుకున్న కత్తులు తీసి చంపేస్తానంటూ బెదిరించి డ్రైవర్ వద్ద వున్న బంగారు ఉంగరం పదిహేను వందల రూపాయలు నగదు, కారును అపహరించుకుని కృష్ణపట్నం పోర్టు వైపు వెళ్లిపోయాడు. దీంతో డ్రైవర్ ఈదగాలి వెళ్లి స్థానికుల సహాయంతో వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


- అసెంబ్లీలో

# ప్రజా సమస్యలు పట్టించుకోలేదు

-------------------------------- కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజా సమస్యలపై చర్చించినా అసెంబ్లీలో పట్టించుకోవడం లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి అనేక సమస్యలు ప్రస్తావించినా ప్రభుత్వం దేనికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం ఆమోదించిన పథకాలు కూడా నేడు కార్యరూపం దాల్చలేదన్నారు. ఎమ్మెల్యేలకు నిధులు లేకుండా ప్రస్తుత ప్రభుత్వం చేసిందన్నారు. అక్రమ ఇసుక రవాణా పెద్దఎత్తున జరుగుతోందని విమర్శించారు. పొదలకూరు మినీస్టేడియం నిర్మాణం కోసం నిధులు మంజూరు, కృష్ణపట్నం ఓడరేవు నిర్మాణ సమయంలో ముత్తుకూరు మండలంలోని గ్రామాల నాన్‌ఫిషర్‌మెన్ ప్యాకేజీ విషయంపైన, కృష్ణపట్నం ఓడరేవు ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదనల విషయంపైన, పొదలకూరు విరువూరు డబుల్‌రోడ్డు పనుల గురించి చర్చించినా సరైన స్పష్టత ఇవ్వలేదన్నారు.

## పెంచలస్వామికి మంచి ఆదాయం



నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీలను లెక్కించగా రూ.55,46,475లు ఆదాయం లభించింది. గత యేడాది నవంబర్ 3 నుంచి మార్చి 30వ తేదీ వరకు లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలలో బంగారం 290గ్రాముల 800మిల్లీ గ్రాములు, వెండి 2.720 కేజీలు, 61యుఎస్‌ఏ డాలర్లు, 16కువైట్ దినార్లు వచ్చినట్లు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రవీంద్రరెడ్డి తెలిపారు.

# బాధ్యతలకు శ్రీకారం చుట్టిన ఎస్పీ



జిల్లా కొత్త ఎస్పీగా గజరావు భూపాల్ మార్చి 27వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. గత ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ నుండి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. గజరావు భూపాల్ డైరక్ట్ ఐపిఎస్ అధికారి. యువకుడు. సమర్థవంతంగా పనిచేయగల శక్తిసామర్థ్యాలున్నాయి. ఏ ఆఫీసర్‌కైనా నెల్లూరుజిల్లాలో పనిచేయడం ఓ మైలురాయి వంటిది. ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ శాంతిభద్రతల సమస్య చాలాతక్కువ. నక్సలిజం లేదు, ఫ్యాక్షనిజం అంతకన్నా లేదు. రౌడీయిజం అంతంత మాత్రమే. అయితే చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు, లైంగిక నేరాలు మాత్రం అన్ని ప్రాంతాల్లో మాదిరిగానే వుంటున్నాయి. జిల్లాలో ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణాకు అవకాశముంది. వీటిని నియంత్రిస్తే చాలు. పోలీసులు బాగా పని చేస్తున్నారనే భావనను ప్రజల్లోకి పంపించ గలిగితే... ఆటోమేటిక్‌గా నేరాలు తగ్గు ముఖం పడతాయి.

ఇక అన్నింటికంటే ప్రధానమైనది నెల్లూరులో ట్రాఫిక్ సమస్య. దీనిని పూర్తిగా పరిష్కరించలేరు. కాకపోతే ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కరించగలిగితే చాలు. పోలీసు పనితీరుకు ఇక్కడే మంచి మార్కులు పడతాయి. ఏది ఏమైనా నెల్లూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గజరావు భూపాల్ సమర్థవంతంగా పనిచేసి ప్రజల మెప్పు పొందాలని ఆశిద్దాం!

# మళ్లీ తెరపైకి టోల్‌గేటు

నెల్లూరురూరల్ మండలం కనుపర్తి పాడు వద్ద హైవేపై టోల్‌గేటు నిర్మాణం మళ్లీ తెరమీదకొచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ టోల్‌గేటు పెట్టబోతే ఈమధ్యే గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వామపక్షాలు, లారీఓనర్స్ అసోసియేషన్ వాళ్లు పెద్దఎత్తున ఆందోళనలు చేసారు. ఇక్కడ నిర్మాణాలను ధ్వంసం చేశారు. 60కిలోమీటర్లకు ఒక టోల్‌గేటు ఉండాలి. కాని నెల్లూరుకు 12కిలోమీటర్ల దూరంలోనే వెంకటాచలం టోల్‌గేటు వుంది. దానికి 30కిలోమీటర్ల దూరంలోనే బూదనం టోల్‌గేటు వుంది. ఈ టోల్‌గేట్ల దోపిడీ ఏంటంటూ ఆందోళనలు చేయడంతో ఇటీవలే ఈ టోల్‌గేటు నిర్మాణాన్ని నిలిపివేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అయితే దీనిపై మళ్లీ కేంద్రప్రభుత్వం నుండే ఆదేశాలు వచినట్లు తెలిసింది. ఇక్కడ టోల్‌గేటు యాజమాన్యాలకు కేంద్రం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా అదనపు టోల్‌గేట్లు పెట్టుకుని వసూలు చేసుకోమని చెప్పడంతోనే ఈ సమస్య వచ్చింది. ఇక ఎవరు ఆందోళనలు చేసినా ఈ టోల్‌గేటు నిర్మాణం ఆగక పోవచ్చు. వాహనదారులకు చేతి చమురు వదలడం తప్పకపోవచ్చు.

## టోల్‌పెడితే తోలు తీస్తాం...



కనుపర్తిపాడు వద్ద టోల్‌గేటు పెడితే తోలు వలుస్తామని గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ టోల్‌గేట్ ప్రజలకు శాపంగా, ఆర్థిక భారంగా మారుతుందని ఆయన బుధవారం విలేకరుల సమావేశంలోచెప్పారు. ప్రజలతో కలిసి ఆందోళనలు సాగించి ఈ టోల్ నిర్మాణాన్ని అడ్డుకున్నాం, కాని కొందరు స్వార్థపరులు తెర వెనుక కథ నడిపిస్తూ ఈ టోల్‌గేట్ పెట్టాలనుకోవడం దారుణం. నెల్లూరు ప్రజలకు ఇబ్బందికరంగా వున్న ఈ టోల్‌గేటుపై జిల్లా మంత్రి వుండి కూడా పి.నారాయణ మాటమాత్రంగా కూడా స్పందించకపోవడం ఇంకా దారుణమని విమర్శించారు. ప్రజలకు కష్టం, నష్టం కలిగించే ఈ టోల్‌గేటు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ఆయన ఘాటుగా హెచ్చరించారు.


# మునిసిపల్ తొలిబడ్జెట్... రచ్చ రచ్చ... ఎట్టకేలకు బడ్జెట్ ఆమోదం

ప్రతిపక్షాల వాకౌట్లు, అధికార, ప్రతి పక్ష పార్టీల వాగ్యుద్ధాల మధ్యే నెల్లూరు నగర పాలక సంస్థ 2015-16 బడ్జెట్ డిప్యూటి మేయర్, టిడిపి కార్పొరేటర్ల మద్దతుతో ఆమోదం పొందింది. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ కేటాయింపులు ఎక్కువగా చూపడంతో ప్రతిపక్ష సభ్యులతో పాటు అధికార కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు. భారీ బడ్జెట్ చూపించి పనులు చేయకపోతే ప్రజల్లో తిరగలేని పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పన్నుల వసూళ్ల పై మునిసిపల్ సిబ్బంది అవలంభిస్తున్న తీరుపైనా రభస జరిగింది. దీనికి నిరసనగా కాంగ్రెస్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి సమావేశాన్ని బహిష్కరించి వాకౌట్ చేశారు. అన్ని అంశాలకు మేయర్ అబ్దుల్ అజీజ్ వివరణ ఇవ్వడంపై టిడిపి కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్ కమిషనర్, ఇతర అధికారుల వివరణ ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించారు. వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అంచనాలు వేశామని కమిషనర్ వివరణ ఇచ్చారు. ఏడాదికాలంగా పనులు చేయకుండా రూ.600కోట్ల భారీ బడ్జెట్ అమలు ఎలా సాధ్యం అవుతుందని టిడిపి కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, డాక్టర్ జడ్.శివప్రసాద్‌లు ఆక్షేపించారు.

## ఇది బోగస్ బడ్జెట్



ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తూ మంగళవారం కార్పొరేషన్‌లో ప్రవేశపెట్టింది బోగస్ బడ్జెట్ అని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దీనిలో అంకెల గారడీ తప్ప ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదన్నారు. ప్రజల నుండి మంచిగా పన్నులు వసూలు చేయడం పోయి... బలవంతంగా వసూలు చేయడం మేయర్ చేతగాని తనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

SRI CITY
An Integrated Business City

శ్రీసిటీ
ప్రగతి ఉత్సవాలకు విచ్చేస్తున్న
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు
గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి,
ఇతర అతిథులకు
స్వాగతం! సుస్వాగతం!!

కార్యక్రమం: ఏప్రిల్ 3, 2015 శుక్రవారం, ఉ॥ 11.30 గం. నుండి

ప్రియతమ ముఖ్యమంత్రి గారిచే...

- పెప్సీకో ఇండియా ఫ్యాక్టరీ ప్రారంభం
- ఉత్పాదన మొదలుపెట్టిన మరో 11పరిశ్రమల ప్రారంభం
- మరో 11 నూతన పరిశ్రమల స్థాపనకు భూమిపూజతో శ్రీకారం

ప్రారంభం కానున్న పరిశ్రమలు: pepsi, artura, chunxing, HunterDouglas, mmpolytech, KUSAKABE, NITTAN VALVE CO.,LTD., NIPPON SEIKI, Siddhartha Logistics, West, ZTT 中天科技


భూమిపూజ జరుపుతున్న సంస్థలు: AYURVET, BeRolleX, beya Silicones & Performance Finishes, Godawari udyog, kgi CLOTHING PVT LTD, cipy, REXAM, VERMEIREN

# 'ప్రభా'తం

మొత్తానికి.. మన్మధ నామ సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు కొంత ఆశాజనకంగానే కనిపిస్తోంది. విభజన శాపంతో అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం కొంతమేరకు కరుణ చూపడంతో, ఈ పయనం ఏమవుతుందోనని బిక్కుబిక్కుమంటూ ఒంటరి యాత్ర సాగిస్తున్న నవ్యాంధ్రకు.. ఎట్టకేలకు కొంత చేదోడు లభించినట్లయింది. వరదల్లో కొట్టుకుపోతున్నప్పుడు ఆసాంతం మునిగిపోకుండా అదృష్టవశాత్తూ ఏ మానో మాకో చేతికి దొరికినట్లు, ఇప్పుడున్న కల్లోల ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్రానికి కేంద్రం ఆదరహస్తం అందించడం, రాష్ట్రప్రగతి పట్ల కేంద్రం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఎంతైనా సంతోషదాయకమే.

అప్పుల ఊబిలో కూరుకుపోతూ, ఓడీతో అప్పుల కాపురం నెట్టుకొస్తున్న రాష్ట్రానికి, 2014-15 ఆర్థిక సంవత్సరం చివరిరోజు (మార్చి 31)న రాష్ట్రానికి కేంద్రం రూ.2300 కోట్ల రూపాయలను మంజూరు చేయడం ఎంతో ఊరట కలిగించింది. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కల్పించాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఢిల్లీలో ప్రకటించిన గంటలోపే, రూ.2300 కోట్లు ఆంధ్రప్రదేశ్ ఖాతాలో జమ కావడం ఎంతైనా విశేషం. 2014-15 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రానికి రెవెన్యూ లోటు రూ.14,242కోట్లు వుండగా, ఇప్పుడు ఇచ్చింది తక్కువే అయినప్పటికీ, ఆ మేరకైనా కేంద్రం వెంటనే స్పందించి నిధులు ఇవ్వడం రాష్ట్రం ఇప్పుడెదుర్కొంటున్న సంక్షోభ దశలో సంతోషకర పరిణామమే. రెవెన్యూ లోటు కింద రూ. 2300 కోట్లు, రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు తొలి దశ నిధులుగా రూ. 250 కోట్లు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి రూ.350కోట్లు మొత్తంగా రూ.4,400 కోట్లు విడుదల కావడంతో, ఇంతకాలంగా నిధుల కోసం ఆంధ్రప్రదేశ్ పడిన శ్రమ ఫలించినట్లయింది. వాస్తవానికి విభజనతో రాష్ట్రానికి జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఆ నష్టం వెనువెంటనే పూడ్చుకునేంత చిన్నదేమీ కాదు. విభజన అనంతరం తొలి ఏడాది వచ్చే రెవెన్యూ లోటును కేంద్రమే భర్తీ చేస్తుందని, గత ఏడాది ఫిబ్రవరి 20న రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించిన నేపథ్యంలో, ఆ లెక్కన ఇప్పుడు రెవెన్యూ లోటు భర్తీకి రూ. 14,242 కోట్లు ఇవ్వాల్సివుంది. అయినా, నిధుల కోసం రాష్ట్రం చేస్తున్న భగీరథయత్నంలో ఇప్పుడు తొలివిడత అన్నట్లుగా రూ.2300 కోట్లు రావడం తొలి ఫలితమే అనుకోవచ్చు. అదేవిధంగా, రాజధాని నిర్మాణానికి రూ.1500 కోట్లు ఇవ్వడం ఎంతైనా శుభపరిణామం. అయినా, కేంద్రం నుంచి ఇంకా రావాల్సిన సాయం ఎంతో వుంది. హుద్‌హుద్ తుఫాన్ సాయంగా ప్రధాని నరేంద్రమోడీ గతంలో ప్రకటించిన రూ. వెయ్యి కోట్ల సాయంలో ఇప్పటికి రూ.720 కోట్లు వచ్చాయి. మరో రూ.280 కోట్లు రావాల్సి వుంది. పోలవరం ప్రాజెక్టు కోసం మొన్నటి బడ్జెట్‌లో ప్రకటించిన రూ.250 కోట్ల సాయం కూడా ఇప్పుడు ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది కనుక, ఆ రూ.250 కోట్లను విడుదల చేశారు. అయితే, పోలవరానికి రావాల్సిన భారీ నిధులు ఇంకా రావాల్సి వుంది. వచ్చే బడ్జెట్‌లోనైనా పోలవరానికి ఎక్కువ శాతం నిధులు కేటాయిస్తారని ఆశిద్దాం. ఏదేమైనా, నిధుల కోసం మన నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఒకటొకటిగా ఒక కొలిక్కి వచ్చి, తొలి అడుగు ఫలవంతమైనట్లేనని భావించవచ్చు. ఈ క్రమంలో, విభజన చట్టం హామీల అమలుకు కేంద్రం కట్టుబడి వుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మరోసారి స్పష్టంగా ప్రకటించడం సంతోషకరం. ఇకపోతే, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో కూడా కేంద్రం సానుకూలంగానే స్పందిస్తుండడం మరో మంచి పరిణామమేనని వేరే చెప్పనక్కర లేదు. ప్రత్యేక హోదా అంటూ వస్తే, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ఇతరత్రా రాయితీలు, ప్రత్యేక ప్యాకేజీలు వుంటాయి కనుక, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం కూడా. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల పరిస్థితికీ, .. విభజనతో, భారీగా వచ్చిన ఆర్థిక నష్టాలతో, చివరికి రాజధాని కూడా లేక పాలన అంతా అస్తుబిస్తుగా తయారైవున్న నవ్యాంధ్ర పరిస్థితికీ ఎంతో తేడా వుంది. దేశసమగ్రాభివృద్ధి అంటే, అన్ని రాష్ట్రాలను ఒకేవిధంగా చూడాలనే భావన కొంతమంది నాయకులకు వుండవచ్చు గాక, ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని కూడా అదే దృష్టితో చూడడం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని అందరూ గుర్తించాలి. మిగిలిన రాష్ట్రాలకు లేని బాధలెన్నో, ఆంధ్రప్రదేశ్‌కు వున్నాయి. విభజనతో కష్టాల్లో, నష్టాల్లో కూరుకు పోయిన రాష్ట్రం తిరిగి తన కాళ్ళమీద తాను నిలబడే వరకు, మళ్ళీ ప్రగతిబాటలో పయనించే వరకు అవసరమైనంత ఆర్థిక సాయాన్ని రాష్ట్రానికి అందజేయడం ఎంతమాత్రం అనుచితం కాదు.. అన్యాయమూ కాదు. కష్టాల్లో తలదాకా కూరుకుపోయివున్న ఈ రాష్ట్రానికి ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తదితర నేతలు అందిస్తున్న చేయూతను ఎవరూ విస్మరించలేరు. ఈ క్రమంలో, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కేంద్రం కట్టుబడి వుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పునరుద్ఘాటించడం.. మరెంతో ఊరట కలిగించే విషయం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేకసార్లు కేంద్రంలోని నేతలను పదేపదే రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధుల విషయం ప్రస్తావించడం, అదే సందర్భంలో కేంద్రంలో కీలకపాత్ర పోషిస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సమయం సందర్భం వచ్చినప్పుడల్లా రాష్ట్రం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తుండడం, ప్రధాని నరేంద్రమోడీ గతంలో చెప్పినట్లుగా, రాష్ట్ర ప్రగతికి అవసరమైన చేయూత నందించేందుకు సుముఖంగా వుండడం..అన్నీ కలిసి వెరసి రాష్ట్రానికి మంచిరోజులు వస్తున్నాయనే శుభసంకేతాలు కనిపిస్తున్నాయి. విభజన దెబ్బతిన్న రాష్ట్రం తిరిగి కోలుకోవాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి. అందుకు కేంద్రం సుముఖంగా వుండడం శుభసంకేతమే! అయితే, ఇంకాస్త ఉదారభావంతో కేంద్రం భారీగా ఆర్థికసాయం అందిస్తే తప్ప, ఆర్థిక అవస్థల నుంచి రాష్ట్రం గట్టెక్కడం సాధ్యం కాదు. కేంద్రం మరింత పెద్దమనసుతో రాష్ట్రానికి అవసరమైన నిధులను కేటాయించి, రాష్ట్రం వీలైనంత త్వరితంగా.. ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతనందిస్తుందని ఆశిద్దాం!..

## శుభ సంకేతం



విభజనతో ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురైన రాష్ట్రానికి, కేంద్రం తాజాగా కొంతమేరకు నిధులు విడుదల చేయడం సంతోషకరం. రాష్ట్రంలో రెవెన్యూ లోటు భర్తీకి 2300కోట్లు, రాజధాని నిర్మాణానికి రూ.1500కోట్లు రావడం హర్షదాయకం. నిధుల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్రానికి ఈ తొలివిడత నిధులు ఎంతో ఊరట కలిగించేవే. ఇదొక శుభసంకేతం. దీంతో, రానున్న రోజుల్లో కేంద్రం నుంచి పూర్తిస్థాయి నిధులొస్తాయనే ఆశాభావం కలుగుతోంది. మొత్తమ్మీద మన్మధ.. మన రాష్ట్రానికి కొంత ఆశాజనకంగానే కనిపిస్తోంది.

# చూడ చక్కగా సీతారాముల కల్యాణం



శ్రీరామ నవమి వేడుకలు నెల్లూరులో వైభవోపేతంగా జరిగాయి. రామాలయాల్లో శ్రీరామ నామం మార్మోగింది. ఎక్కడ చూసినా భక్తజనం సీతారాముల కల్యాణోత్సవాల్లో పాల్గొని ఆనందంతో పరవశించిపోయారు. అందులోనూ, నగరంలో ప్రసిద్ధమైన శబరి శ్రీరామ క్షేత్రంవారి ఆధ్వర్యంలో, రామకోటి మహ యజ్ఞ స్థూపం ప్రాంగణంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులతో పాటు, అధికారులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. రామ నామ జపంతో ఈ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది.

కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భావనాచార్యులవారి ఆధ్వర్యంలో అత్యంత శోభాయమానంగా స్వామివార్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో, వేద మంత్రాలతో, శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, యువరాజ్ (విశాఖ కలెక్టర్) దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారాముల ఉత్సవంలో పాల్గొని, స్వామివార్ల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అదేవిధంగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గారావు దంపతులు, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత స్వామివార్ల అక్షింతలను, ముత్యాల తలంబ్రాలు, మంగళసూత్ర దారాలను భక్తులకు అందజేశారు. ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం, టిటిడి కళ్యాణ మండపం ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి, నాగమణి దంపతులు ఈ కల్యాణ మహోత్సవానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డితో పాటు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, నిర్వాహకులు బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్, దద్దోలు రమణయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, శబరి శ్రీరామ క్షేత్రంలో భక్తులు సమర్పించిన శ్రీరామకోటి గ్రంథాలను శ్రీరామకోటి మహాయజ్ఞ స్థూపం వద్ద నిక్షిప్తం చేశారు.

## పెరిగిన ప్లాట్‌ఫాం టిక్కెట్లు

గతంలో అయిదు రూపాయలు వున్న రైల్వే ప్లాట్‌ఫాం టిక్కెట్లు ఇప్పుడు పది రూపాయలకు పెరిగింది. రైల్వే రిజర్వేషన్ సౌకర్యం ప్రస్తుతం 60రోజుల నుంచి 120రోజులకు పెంచారు. ఈ పెరుగుదల బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది.



ఈ నెల 23న హైదరాబాద్ త్యాగరాయ గానసభలో సోమా రాధాకృష్ణ - సాహితీ కిరణం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కవితల పోటీల్లో పాల్గొని నానీల సృష్టికర్త ఎన్.గోపి తదితర ప్రముఖుల నుంచి సత్కారం, నగదు బహుమతిని అందుకుంటున్న నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి గుర్రాల రమణయ్య.




## పేరుకే జయనామం

జయ నామ సంవత్సరంలో పేరుకే జయముంది. మనకు అన్నీ అపజయాలే. ఈ సంవత్సరంలోనే భద్రాద్రి రాముణ్ణి దూరం చేసుకున్నాం. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోయాం. తెలుగుజాతి రెండుగా చీలింది. హుద్‌హుద్ తుఫాన్ తీరని నష్టాన్ని మిగిల్చింది. ముఖ్యులు చాలామంది మట్టిలో కలిసి పోయారు. అయితే కాంగ్రెస్‌ను వల్లకాటికి పంపింది కూడా ఈ సంవత్సరంలోనే! కనీసం మన్మధనామ సంవత్సరంలోనైనా అందరికీ మంచి జరగాలని ఆశిస్తూ...

– వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## బస్‌షెల్టర్ కావాలి

నెల్లూరు పట్టణంలో రంగనాయకులపేట గేటు దగ్గర బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి. కావలి, ఆత్మకూరు, అల్లూరు, ఉదయగిరి, ఒంగోలు, విడవలూరు, కొడవలూరు, దగదర్తి, వింజమూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు ఈ ప్రాంతంలో బస్సులెక్కుతుంటారు. ప్రయాణీకులకు ఇక్కడ నిలువ నీడ లేదు. ఆత్మకూరు బస్టాండ్‌కు పోయి ఎక్కాలంటే ఆటోలు, టౌన్‌బస్సులకు అదనంగా ఛార్జీ దండగ. ఇక్కడ బస్ షెల్టర్ ఏర్పాటుపై ఎమ్మెల్యే, మేయర్‌లు తక్షణం స్పందించి చొరవ చూపాలి.

ఎస్.మహేష్, నెల్లూరు.

## సింగపూర్ బిల్డప్ ఎందుకు?

రాజధాని మాస్టర్‌ప్లాన్‌ను సింగపూర్ వాళ్ల చేత గీయించానని చంద్రబాబు గొప్పలు చెప్తుకుంటున్నాడు. ఈ మాత్రం మాస్టర్‌ప్లాన్‌లను మన దేశంలో ఇంజనీరింగ్ కంపెనీలు గీయలేవా? మన ఇంజనీర్లు విదేశాలలో ఎయిర్‌పోర్టులు, డ్యాంలు కడుతున్నారు. సొంత రాజధానికి మాత్రం సొంత ఇంజనీర్లు పనికిరాకుండా పోయారు.

డి.జగదీష్‌ప్రసాద్, గూడూరు.

# సక్సెస్ @ పిఎస్ఎల్వి-సి27

- విజయపథంలో సాగుతున్న ఇస్రో మరో ముందడుగు
- సొంత నేవిగేషన్ వ్యవస్థను రూపొందించుకున్న భారత్

***అంతర్జాతీయంగా అంతరిక్ష ప్రయోగాలను అత్యంత తక్కువ ఖర్చుతో నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు విజయపంథాలో నడుస్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో ముందడుగు వేసింది. రోదసి ఆధారిత సొంత దిక్సూచి వ్యవస్థను కలిగిన అగ్రదేశాల సరసన భారత్ నిలిచింది.***



మార్చి 28వ తేదీ సాయంత్రం 5.19గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం నుండి ప్రయోగించిన పిఎస్ఓల్వి-సి27 విజయవంతమైంది. దీనిద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1డి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ఉపగ్రహ ప్రయోగంతో సొంత నేవిగేషన్ వ్యవస్థను రూపొందించుకున్నట్లయ్యింది. ఈ సేవల కోసం ఇంతకాలం మనం అమెరికాకు చెందిన జిపిఎస్ వ్యవస్థపై ఆధారపడుతూ వచ్చాం. మొత్తం 4దశలలో ఈ ప్రయోగం జరిగింది. 19.33 నిముషాల వ్యవధిలో ప్రయోగం విజయవంతమై 1425కిలోల బరువుగల ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టారు. కక్ష్యలోకి చేరగానే దీని సౌరఫలకాలు తెరుచుకున్నాయి. ఐఆర్ఎన్ఎస్ఎస్-1డి ప్రయోగంతో నాలుగు దిక్సూచి గ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లయ్యింది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్ట్ క్రింద మొత్తం ఏడు ఉపగ్రహాలను ప్రయోగించాల్సివుంది. అయితే దిక్సూచి వ్యవస్థ పని మొదలు పెట్టడానికి నాలుగు ఉపగ్రహాలుంటే సరిపోతుంది కాబట్టి ఈ దిశగా పని ప్రారంభమైనట్లే!

ఈ ఉపగ్రహం పదేళ్లపాటూ పనిచేస్తుంది. భారత్‌కు చుట్టూ 1500కిలోమీటర్ల వరకు ఇది సేవలందించగలుగుతుంది. భూ, జల, వాయు మార్గాలలో స్థితి, స్థాన దిక్కులను ఇది తెలియజేస్తుంది. డ్రైవర్లకు దృశ్య మరియు వాయిస్ ద్వారా గమనాన్ని నిర్దేశించగలుగుతుంది. మొబైల్ ఫోన్‌తో అనుసంధానం కావడంతో పాటు విపత్తుల సమయాలలోనూ సహాయ బృందాలకు సమాచారాన్ని చేర వేస్తుంది. వాహన గమనాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించడం, నౌకల సమూహ నిర్వహణలోనూ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రయోగానికి గాను రాకెట్‌కు 250కోట్లు, ఉపగ్రహానికి 145కోట్లు ఖర్చయ్యింది. ప్రయోగం విజయవంతం కాగానే షార్ శాస్త్రవేత్తలందరూ ఒకర్నొకరు కౌగిలించుకుని అభినందనలు తెలుపుకున్నారు. ఇక రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, భారత ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబునాయుడులు అభినందలు తెలిపారు.



# కళ్లల్లో ఇసుక కొట్టారు

- బ్రతుకుదెరువు చూపించడం లేదు
- బ్రతుకుల మీదే కొడుతున్నారు

***బాబు వస్తే జాబు వస్తుంది... 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నినాదం. బాబు రానే వచ్చాడు. కొత్త జాబు రాకపోతే పోయింది.. ఉన్న జాబులను కూడా ఊడకొడితే ఎట్లా? ప్రభుత్వ విధానాలైనా, చట్టాలైనా ప్రజలకు బ్రతుకుదెరువు చూపించేలా, వాళ్ల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చి దిద్దేలా ఉండాలేగాని వాళ్ల బ్రతుకుల మీదే దెబ్బ కొట్టేలా ఉండకూడదు.***

దేశంలో ప్రజలందరికీ ప్రభుత్వాలే ఉపాధి చూపించడం లేదు. ఒకరకంగా చెప్పాలంటే అగ్రదేశాలతో పోల్చి చూసినా కూడా ప్రభుత్వం మీద ఆధారపడకుండా, స్వయం వృత్తులను, వ్యాపారాలను చేసుకుంటూ బ్రతికేవాళ్లు మన దేశంలోనే ఎక్కువ. వీరిలో సన్న చిన్న వృత్తి, వ్యాపారవర్గాల వారు ఎక్కువుగా వుంటారు. ఈ కోవలోకే వస్తారు నెల్లూరులోని టైరుబండ్ల యజమానులు.

నెల్లూరుకు టైరుబండ్లకు మధ్య అనుబంధం ఈనాటిది కాదు. తరతరాల క్రితంది. ఈరోజంటే ట్రాక్టర్లు, ట్రక్కులు, లారీలు వచ్చాయి. ఇవి రాకముందు కాలంలో నెల్లూరులో చిన్న పూరిల్లు కట్టాలన్నా, పెద్ద భవంతిని నిర్మించాలన్నా టైరుబండ్లలోనే ఇసుక, ఇటుక, ఇతర నిర్మాణ సామాగ్రి తోలాల్సివచ్చేది. నెల్లూరులో టైరుబండ్లను తోలుకుంటూ కొన్ని వందల కుటుంబాలు బ్రతుకుతున్నాయి. ఈ టైరుబండ్లు ఉండబట్టే కొన్ని ఎద్దులన్నా కబేళాలకు పోకుండా సజీవంగా ఉంటున్నాయి.

ముఖ్యంగా ఇసుక తోలకం మీదనే టైరుబండ్ల యజమానులు నాలుగు రూపాయలు సంపాదిస్తుండే వాళ్లు. నాలుగు మెతుకులు తింటుండేవాళ్లు. నిర్మాణ రంగంలో వచ్చిన వేగం వల్ల ఇసుక బంగారం కావడం, ఇసుక రీచ్‌లకు టెండర్లు వేయడం, ఇసుక గనులు కోలార్ గోల్డ్‌ఫీల్డ్స్‌లాగా తయారు కావడం జరిగింది. అయితే ఇసుక ఎంత పెద్ద మాఫియాగా మారినా కూడా నిన్న మొన్నటి దాకా సీఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు ఏ ముఖ్యమంత్రి కూడా సన్నజీవుల, శ్రమజీవులైన టైరుబండ్ల వాళ్ల జోలికి పోలేదు. వారి మానానవాళ్లను ఇసుకను తోలుకోనిచ్చే వాళ్లు. గత ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలపై నిషేధం విధించి నప్పుడు కూడా చిన్నచిన్న నిర్మాణాలకు ఇసుకను అందించింది టైరుబండ్ల వాళ్లే!

తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఇసుక పాలసీ మారిపోయింది. డ్వాక్రా గ్రూపులకు ఇసుక రీచ్‌లను అప్పగించారు. క్యూబిక్ మీటర్ ఇసుక ధరను 600రూపాయలుగా నిర్ణయించారు. ఇసుక బండ్ల వాళ్లను కూడా అదే ధర చెల్లించి ఎత్తుకు పొమ్మంటున్నారు. మార్కెట్‌లో బండి ఇసుకను 500 లేదా 600రూపాయలకు అమ్ముకోగలరు. అంతకుమించి ధర పెంచితే వీళ్ల దగ్గర ఇసుక తోలించుకునేవాళ్లుండరు. ట్రాక్టర్లు, టిప్పర్లతో తోలించుకొంటారు. 600రూపాయలు చెల్లించి ఇసుకను తోలితే వీరికొచ్చేదేమీ వుండదు. రెక్కల కష్టం కూడా రాదు. ఇక జతఎద్దులకు రోజు రవాణా ఖర్చు వంద నుండి రెండొందల రూపాయల దాకా ఉంటుంది. కాబట్టి 600రూపాయలు పెట్టి ఇసుక కొని తోలడం కష్టం. టైరుబండ్ల వాళ్లు గతంలోలాగే పెన్నలోకి వెళ్లి ఇసుకను తోలుతుంటే పోలీసులు కేసులు పెడుతున్నారు. టైరుబండ్లకు ఉచితంగా ఇసుక ఇవ్వాలంటూ వైకాపా, వామపక్షాలు, బీజేపీ పార్టీలు ఆందోళనలు కూడా చేశాయి. కాని అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. కనీసం ఇసుక ధరన్నా 600రూపాయలు కాకుండా రెండుమూడొందలన్నా చేస్తే కొంత వరకు కట్టి తోలుకోగలుగుతారు. అది కూడా చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో తమకు ఎద్దులు, బండ్లను అమ్ముకోవడం తప్ప మరో మార్గం లేదని టైరుబండ్ల యజమానులు వాపోతున్నారు.

## కనుచూపు మేరలో
# కనపడని ఆశలు



- స్థంభిస్తున్న వ్యాపారం
- జోరు లేదు... హుషారు లేదు

***ప్రభుత్వం బాగుంటే ప్రజలు బాగుంటారు. పరిపాలన పరుగులు పెడుతుంటే ప్రజల ఆర్థిక స్థితిగతులు కూడా పరుగులు పెడుతుంటాయి. ప్రభుత్వ పాలనా విధానాలు ఏ మాత్రం గాడితప్పాయో ప్రజాజీవనం కూడా అస్తవ్యస్థంగా మారుతుంది.***

దాదాపు ఐదేళ్లుగా పలు రకాల వ్యాపారాలలో స్థబ్దత నెలకొంది. ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో రియల్ ఎస్టేట్ దారుణంగా దెబ్బతినడం వల్ల దానికి సంబంధించిన ఇతర వ్యాపారాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. 2004-09 మధ్య జిల్లాలో రియల్ ఎస్టేట్ మూడు ఫ్లాట్లు ఆరు లే అవుట్లు అన్నట్లుగా నడిచింది. జిల్లాలో అప్పుడే పారిశ్రామికాభివృద్ధి జోరందుకుంది. జిల్లాకు ఎన్నో పరిశ్రమలు తరలివచ్చాయి. దాంతో స్థలాలు, పొలాల రేట్లు పెరగడంతో రైతులు బాగుపడ్డారు. స్థలాల యజమానులు ఆర్థికంగా లాభపడ్డారు. ఆ కాలంలో అనూహ్యంగా ఆస్తులు, ఆదాయం పెరగడం, కొత్త భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మాణం జరగడం ఇంకా ప్రజలకు ఖర్చుపెట్టే స్థోమత పెరగడంతో అన్ని రకాల వ్యాపారాల పరిస్థితి బాగుపడింది. వాటి టర్నోవర్ బ్రహ్మాండంగా వుండింది. అంతెందుకు అప్పట్లో నెల్లూరులోని పలు హోటళ్లలో రూమ్‌లు దొరికేవి కావు. రూమ్‌ల కోసం ఎమ్మెల్యేల స్థాయిలో సిఫార్సులు చేయించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదంతా కూడా ఐదారేళ్ల క్రితం పరిస్థితి.

మరి ఇప్పుడు చూస్తే... గత ప్రభుత్వంలోనే జిల్లాలో రియల్ ఎస్టేట్ పతనమైంది. భూముల కొనుగోళ్లు, అమ్మకాలు నిలిచిపోయాయి. రాష్ట్ర విభజనతో పాటు రాజకీయ సంక్షోభాల కారణం, రియల్ వ్యాపారం పతనం కావడం, దానికి సంబంధించిన వ్యాపారాలన్నీ కూడా దెబ్బ తినడం జరిగింది.

సరే... కాంగ్రెస్ పోయింది, తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు పరిపాలనా పరంగా అనుభవజ్ఞుడు, ఆయన పాలనలో మళ్ళీ వ్యాపారాలు పుంజుకుంటాయని ఆశించిన వారి ఆశలు తలక్రిందులయ్యాయి. ఈ ప్రభుత్వ విధానాల వల్ల వ్యాపారుల పరిస్థితి మరీ దిగజారిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం గతం కంటే ఇంకా పడిపోయింది. సిమెంట్ ధరలు పెరగడం, కొత్త ఇసుక పాలసీతో నిర్మాణ రంగం సంక్షోభంలోకి వెళ్లింది. దీంతో వీటికి సంబంధించిన ఇతర వ్యాపారాలలో కూడా స్థబ్ధత నెలకొంది. వ్యాపారాలు బాగా లేక పోవడంతో ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయి.

ఇక ప్రభుత్వం కొత్తగా విధిస్తున్న చట్టాలు కూడా వ్యాపార రంగాన్ని ఇప్పట్లో కోలుకోనీయక పోవచ్చు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

MK 45th ANNIVERSARY
వార్షికోత్సవ ఓం కృతజ్ఞతాభివందనములు
"మురళీకృష్ణ గ్రూప్" ని 45 సంవత్సరాలుగా ఆదరిస్తున్న
మా కస్టమర్ దేవుళ్ళ
అభిమానమే అండగా ...
మీ ఆదరాభిమానాలు పొందుతున్న మా గ్రూప్స్
* మురళీకృష్ణ 70 Multicuisine A.C. Restaurant
* మురళీకృష్ణ శాఖాహార భోజనం కాఫీ, టిఫిన్ & ఐస్‌క్రీమ్స్
* మురళీకృష్ణ నేతిమిఠాయిలు
* మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు
నిర్వాణ Multicuisine A/C Restarant
మాగుంట లేఅవుట్, నెల్లూరు.
సరికొత్త రుచులతో
నూతన ఒరవడికి
శ్రీకారం... నిత్య నూతనం
మా మీ " మురళీకృష్ణ "

సకుటుంబ సమేతంగా విచ్చేసి మా ఐటమ్స్‌ని ఆస్వాదించండి...
ఆరగించండి... ఆనందించండి... మమ్ము ఆశీర్వదించండి!
మీ... గ్రోసు గోపాలయ్య
మురళీకృష్ణ 70 గ్రూప్ నెల్లూరు ఫోన్ : 2327522

# నెల్లూరు కబుర్లు

## బస్సులు లేక ఇక్కట్లు

తెలంగాణ ప్రభుత్వం వాహన టాక్స్‌ను బాదడంతో మంగళవారం నుండి హైదరాబాద్‌కు వెళ్లే ప్రైవేట్ బస్సులను బంద్ చేశారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణీకులు అగచాట్లు పడుతున్నారు. వేసవికాలం సెలవులు కావడంతో రైళ్లలో రిజర్వేషన్‌లు దొరికే పరిస్థితి లేదు. ఆర్టీసీ బస్సులు తగినన్ని అందుబాటులో లేవు. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు ప్రతిరోజూ పాతిక పైనే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నడుస్తుంటాయి. ఇవన్నీ ఆగిపోవడంతో ప్రయాణీకులు ఆర్టీసీ, రైల్వేస్టేషన్‌లకు పరుగులు తీయాల్సి వచ్చింది.

## కార్పొరేషన్ కలెక్షన్ల జోరు

నెల్లూరు మునిసిపల్ కమిషనర్ చక్రధర్‌బాబు ఆదేశాలతో అడిషనల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు జోరు పెంచారు. దీంతో సోమవారం ఒక్కరోజే రూ. 1.13కోట్లు పన్నులు వసూలు చేశారు. నగరంలోని ఏసి నగర్, చిల్డ్రన్స్ పార్కు సెంటర్, ఆర్టీసీ, మద్రాసుబస్టాండ్, గాంధీబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి కలెక్షన్ల హోరు పెంచారు. కార్పొరేషన్‌కు బకాయిలు వున్న షాపుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నవాబుపేట తోటబడి వెనుక ఉన్న ఓ రైసుమిల్లు యజమాని రూ. 1.16లక్షలు పన్ను బకాయి ఉండడంతో మిల్లును సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌ఐలు సమద్, అజయ్, ఆర్‌ఓలు కృపాకర్, కృష్ణకిషోర్, బాలకృష్ణ, సునీల్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన గ్రాడ్యుయేషన్‌డే



నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్ స్కూలు, మాగుంట లే-అవుట్‌లోని ఫ్యూచర్‌విజన్ స్కూలు, సర్దార్ వల్లభాయ్‌పటేల్ నగర్‌లోని థింక్‌నెక్స్ట్ స్కూల్స్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను ఆదివారం అనిల్‌గార్డెన్స్‌లో ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆటపాటలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక యాంకరింగ్‌లతో అందరినీ ఆకట్టుకుంది. డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్, జడ్జి ప్రవీణ్‌కుమార్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, ప్రిన్సిపల్స్ లక్ష్మి, కల్యాణి, లత అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ రుక్మిణి, సునీల్, మేనేజర్లు పాల్గొన్నారు.

## 'దేశం' ఆవిర్భావ దినోత్సవం




ఎన్టీఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు నడుస్తున్నారని రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం నెల్లూరు టిడిపి కార్యాలయంలో టిడిపి 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను ఎగురవేసి అనంతరం జడ్. శివప్రసాద్, తెలుగు యువత టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 34కేజీల కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు టిడిపి అండగా ఉంటుందన్నారు. పేదల కోసం ఎన్టీఆర్ అనేక పథకాలను ప్రవేశ పెట్టారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, సీనియర్ నాయకులు బెజవాడ ఓబుల్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.అనూరాధ, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయ వనరుగా పాత జడ్పీఆఫీసు

నెల్లూరులోని పాత జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఖాళీగా వున్న ఆర్‌డబ్ల్యూఎస్, ఈఈ కార్యాలయం స్థలంలో షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం పాత జడ్పీ భవనం వద్ద ఆయన మాట్లాడుతూ పాత భవనం వద్దనున్న ఖాళీస్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే వచ్చే బాడుగలతో జడ్పీకి ప్రతినెలా ఆదాయం వస్తుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఈఈ కార్యాలయ భవనాల్ని పూర్తిగా తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ ఎం.జితేంద్ర, పిఆర్‌ఎస్ఇ రవీంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రామిరెడ్డి పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఆఫీసుకు కరెంట్ కట్

నెల్లూరు తహశీల్దార్ ఆఫీసుకు కూడా కరెంట్‌షాక్ తప్పలేదు. తహశీల్దార్ కార్యాలయం తరఫున 7.14లక్షల బిల్లులు కట్టాల్సి వుంది. చాలాకాలం నుండి కట్టలేదు. సాధారణంగా ఇళ్లకు, ప్రైవేట్ సంస్థలకు ఒక నెల బిల్లు కట్టకుంటేనే విద్యుత్ సిబ్బంది వచ్చి కనెక్షన్ పీకేస్తారు. సాటి గవర్నమెంట్ ఉద్యోగులు కదా అని చాలాకాలం వేచి చూసారు. ఎంతకీ బకాయిలు చెల్లించకపోవడంతో సోమవారం విద్యుత్ సిబ్బంది వచ్చి కరెంట్ కట్ చేశారు. దీంతో ఆఫీసులో కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు ఆగిపోయి సిబ్బంది, గ్రీవెన్స్‌డే కావడంతో అర్జీలు ఇవ్వడానికి వచ్చిన జనం ఇబ్బంది పడ్డారు.

## అమ్మవార్ల హుండీలలో కాసుల గలగల..





నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 16,96,187లు ఆదాయం లభించింది. సోమవారం దేవస్థానంలో హుండీలను లెక్కించారు. గత ఏడాది డిసెంబర్ 23 నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఆలయ హుండీలను లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కోదండ రామిరెడ్డి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర పాల్గొన్నారు.

**ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో...**

మూలాపేటలోని గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 3,26,213లు ఆదాయం లభించింది. సోమవారం దేవస్థానంలో హుండీలను లెక్కించగా ఈ యేదాది జనవరి 28 నుంచి మార్చి 30వ తేదీ వరకు ఈ ఆదాయం లభించింది. ఈ లెక్కింపులో దేవస్థానం మాజీఛైర్మెన్ సూరిశెట్టి నరేంద్ర, ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవి శ్రీనివాసులురెడ్డి, మాజీధర్మకర్తల మండలి సభ్యులు హరికుమార్, సురేష్‌బాబు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పందులను పట్టుకున్నారు

నెల్లూరు నగరంలో పందుల సమస్య ఎక్కువవుతుండడంతో నగరపాలక సంస్థ అధికారులు వాటిని దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నగరంలోని పరమేశ్వరినగర్, ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపం, ధర్మరాజ దేవస్థానం సమీపం తదితర ప్రాంతాల్లో తిరుగాడుతున్న పందులను పట్టివేసి, వాటి యజమానులే వాటిని దూరంగా తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరపాలకసంస్థ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని పందులను దూరంగా తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు.




శ్రీరామనవమి సందర్భంగా విజయనగరం జిల్లా పార్వతీపురంలో జరిగిన సాహితీలహరి కార్యక్రమంలో బాలసాహితీవేత్త, పరిశోధకుడు డా॥ గంగిశెట్టి శివకుమార్‌ను సత్కరిస్తున్న ఆ సంస్థ అధ్యక్షులు డా॥ మంచిపల్లి శ్రీరాములు, సభ్యులు సి.భీమేశ్వరరావు, సారథి, శివ్వాం ప్రభాకరం, పల్ల పరిశనాయుడు

## తెలుగు విద్యార్థి మోడల్ ఎంసెట్ 19న



టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా మోడల్ ఎంసెట్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం టిడిపి జిల్లా ప్రధాన కార్యాలయంలో టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జడ్. శివప్రసాద్, తిరుమలనాయుడు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేవలం నామమాత్రపు ఫీజుతో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి పది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్ములు, సాయికిషోర్, ప్రేమకుమార్‌రెడ్డి, హర్ష, ముత్తుజా పాల్గొన్నారు.

## బులియన్ మర్చంట్స్ అధ్యక్షుడిగా శాంతిలాల్ జైన్

ది నెల్లూరు డిస్ట్రిక్ట్ బులియన్ అండ్ డైమండ్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శాంతిలాల్ జైన్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కార్యవర్గ ఎన్నికలు నెల్లూరులోని ఓ హోటల్‌లో జరిగాయి. శాశ్వత అధ్యక్షుడిగా శాంతిలాల్‌జైన్ ఆధ్వర్యంలో మెజార్టీ సభ్యులు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డి.ప్రభాకర్, ప్రధానకార్యదర్శిగా జెవిఎల్ సత్యం, కార్యదర్శిగా మణిలాల్‌జైన్, కోశాధికారిగా శంకర్‌లాల్‌జైన్, ఉపకోశాధికారిగా సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు.




## అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం తేవాలి

రక్త, నేత్ర, మూత్రపిండాల దానంలాగే అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, నెల్లూరుజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి భారతీరెడ్డి సూచించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల సంఘం, నెల్లూరు నగర వాకర్స్ సంఘం సంయుక్త సహకారంతో ఆదివారం 'అవయవదానం పై జీవన్ ధాన్' ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని భారతీరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీరెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల కారణంగా ఆధునిక వైద్యం అందుబాటులో ఉందన్నారు. దీనివల్ల అవయవదానం చేసిన వ్యక్తి నుంచి అవయవాలు వేరుచేసి అవసరమైన వాళ్లకు అమర్చడం సులభమవుతుందని తద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు.

డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తోటివారి హితం కోసం మనం చనిపోయిన తరువాత కూడా అవయవాలు మట్టిలో కలిసిపోకుండా, కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న వారికి అవయవాలు దానం చేయడం వల్ల వారి ప్రాణాలు కాపాడి ప్రాణదాతలు కావడం మేలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకిరెడ్డి, ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మనోహర్‌రెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండోపంటకు నీళ్ళు లేనట్లే!

**- జిల్లా కలెక్టర్ యం.జానకి**



నెల్లూరుజిల్లా పరిధిలో రెండో పంటకు, సోమశిల, కండలేరు జలాశయాల నుండి నీరు ఇవ్వలేమని, ఈ విషయంపై రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ యం.జానకి కోరారు. సోమవారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ సోమశిల జలాశయంలో ప్రస్తుతం 3.5టిఎంసీల నీరు మాత్రమే వుందని తెలిపారు. కండలేరు జలాశయంలో 2.5టిఎంసీల నీరు వుందని, ఇందులో 0.5టిఎంసీల నీటిని తెలుగుగంగ కాలువ ద్వారా తమిళనాడుకు పంపనున్నామని, 2టిఎంసీల నీటిని జిల్లా తాగునీటి అవసరాలకు వినియోగించనున్నామని తెలిపారు. కనుక జిల్లా రైతాంగం ఈ విషయంపై సహకరించి రెండవపంట వేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ సిఇ ఏ.సుధాకర్, ఎస్ఇ రెడ్డయ్య పాల్గొన్నారు.

# అసెంబ్లీలో నిలదీసి అడిగా...

**- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరురూరల్ నియోజకవర్గంలోని ప్రజాసమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వైయస్సార్ నగర్‌లో నిర్మించిన ఇళ్లను సత్వరమే అర్హులకు అందజేయాలని, తాగు నీటికి ఇబ్బంది లేకుండా సమ్మర్ స్టోరేజీలో పూర్తిస్థాయిలో నీరు నిల్వచేయాలని, రూ.4కోట్లతో గాంధీనగర్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు. బుజబుజనెల్లూరు, కొత్తూరు ప్రాంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, కాలుష్యం బారి నుంచి నాల్గవమైలు ప్రాంతాన్ని కాపాడాలని, ఈఎస్ఐ ఆసుపత్రిలో వసతులు కల్పించాలని విన్నవించినట్లు తెలిపారు. పెండింగ్‌లో వున్న ఇళ్ల స్థలాల దరఖాస్తులను పరిష్కరించాలని కొమ్మరపూడిలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని తదితర సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేందుకు ఆయా శాఖల మంత్రులను స్వయంగా కలసి విన్నవించినట్లు తెలిపారు.

ఈ సమావేశంలో వైయస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గౌరి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంటలు ఎండకుండా...

# నీడలా ఉంటాం..!

**- మంత్రి డా. నారాయణ**



జిల్లాలో దాదాపు 36 శాతం సాగునీటి కొరత ఏర్పడిందని, ఆ సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా.పొంగూరు నారాయణ అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే దాదాపు 8.5లక్షల ఎకరాలకు సాగునీటిని అందించామన్నారు. కావలి ప్రాంతంలోని బ్రాహ్మణక్రాక, చినక్రాక గ్రామాల్లో 690 ఎకరాలకు సాగునీటి సమస్య వుందని, వాటికి దాదాపు 10 రోజులపాటు 3 వందల క్యూసెక్కుల నీటిని అందించి పంటలు పూర్తిగా పండించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, వెంకటాచలం మండలంలో దాదాపు 12 వందల ఎకరాలకు కనుపూరు కెనాల్ నుంచి 5 వందల క్యూసెక్కుల నీటిని 5 రోజుల పాటు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైదాపురం మండలంలో 320 ఎకరాలకు, డక్కిలి మండలంలో 120 ఎకరాలకు సాగునీటి కొరత వుందని, సాగునీటి కాలువ సదుపాయాలు లేని ప్రాంతాల్లో అవసరమైన బోర్లు వేయించి పంటలకు నీరందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సైదాపురం మండలంలో 10బోర్లు, డక్కిలి మండలంలో 12బోర్లువేసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. అయితే, జిల్లాలో రెండవ పంటకు సాగునీటిని అందించే పరిస్థితి లేదని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లాలో వీలైనంతవరకు పంటలు ఎండిపోకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఆయన అన్నారు. జిల్లాలో 46 మండలాలు వుండగా, 29 మండలాల్లో తాగునీటి సమస్యలున్నట్లు గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ఈ సమస్యలను నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెల్లూరు నగరంలో మంచినీటి కోసం రెండు ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు, అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ సిస్టం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని మునిసిపాలిటీల్లో వచ్చే నెలలోగా ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షులు బీదా రవి చంద్ర, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ ఛైర్మెన్ టి.అనూరాధ, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు




శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత - సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

ప్రథమ వర్ధంతి

నిరంతర శ్రామికుడిగా మా అభివృద్ధిని కాంక్షించి
మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి
మంచికి, మానవత్వానికి, దాతృత్వానికి
మారుపేరుగా నిలచిన మా ఇంటి దైవం

కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
పరమపదించి 18.04.2015 నాటికి యేడాది గడుస్తోంది.
వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు:
చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి
మనుమలు: హరీశ్వర్‌రెడ్డి, భవనేశ్వర్‌రెడ్డి

కుమార్తెలు - అలుళ్లు
సువర్చల - మాలకొండారెడ్డి
కరుణ - శ్రీనివాసులురెడ్డి
అరుణ - పరంధామిరెడ్డి
మమత - జగదీష్

మేనల్లుడు
ప్రసాద్‌రెడ్డి - హరిత
మరియు
మనుమరాళ్ళు

ప్రథమ వర్ధంతి: తిథుల ప్రకారం వారి ప్రథమ సంస్మరణ తేది.07.04.2015 మంగళవారం ఉ॥ 10.30గంటలకు నెల్లూరు, మాగుంట లే - అవుట్, రోడ్డు నెం.2లోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# గూడూరు డివిజన్ వార్తలు

### నాన్‌ప్లాన్ గ్రాంటు పనులు

## మూడు నెలలో పూర్తి చేయాలి

**గూడూరు మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిల్ నిర్ణయం**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రక్కన కమిషనర్ ప్రమీల

గూడూరులోని పురపాలక కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇటీవల సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరచిన అంశాలపై కౌన్సిలర్లు చర్చించి ఆమోదించారు. అధికంగా కొట్లలో పన్నులు చెల్లించవలసిన వారిని వెంటనే కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ కోరింది. ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా వస్తున్న నిధులతో క్రమబద్ధం లేకుండా గదులు, మురుగుదొడ్లు నిర్మిస్తున్నారని, మొదట అవసరమైన వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. 2013-14సంవత్సరానికి చెందిన నాన్‌ప్లాన్ గ్రాంటు క్రింద 35పనులు అజెండాలో కౌన్సిల్ అనుమతి కోరగా, ఒకే గుత్తేదారు తక్కువ లెస్‌లతో దక్కించుకున్నాడని, కానీ ఇన్ని పనులు ఎన్ని రోజుల్లో చేస్తారో చెప్పాలని కౌన్సిలర్లు ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం మూడునెలల్లో పూర్తి చేయాలని చెప్పడంతో పూర్తి చేయకపోతే చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రెండోపట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ పటిష్టతకు

## ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలి

తెలుగుదేశం పార్టీ పటిష్టతకు పల్లెల్లో ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోడూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు మండలంలోని దివిపాళెం పంచాయతీ పరిధిలోని అడివయ్యకాలనీలో ఆదివారం తెలుగుదేశంపార్టీ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జెండాను ఎగురవేశారు.



తెదేపా జెండాను ఎగురవేస్తున్న కోడూరు శ్రీనివాసులురెడ్డి

ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రాజు, మధుసూధన్‌రెడ్డి, బుజ్జా నాగేశ్వరరావు, రవీందర్‌రెడ్డి, గోపాల్‌నాయుడు, సురేష్, ఆనంద్, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## నయనానందకరంగా శ్రీరామనవమి వేడుకలు



గూడూరులోని షిర్డి సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతి, అభిషేకం, అష్టోత్తర శతనామావళి, విష్ణు సహస్రనామం, ధునిపూజ నిర్వహించారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం అన్నదానం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా బాబా మందిరం భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని కోనేటిమిట్ట వద్దనున్న కోదండ రామాంజనేయ స్వామి దేవాలయం నరసింగరావుపేట ప్రాంతంలోని శ్రీరామాలయం, సిరామిక్ కాలేజీ రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో, సాయి సత్సంగ నిలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఊరేగింపు జరిగింది. సీతారాములను దర్శించేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ముత్యాల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను అందరికీ అందజేశారు.

### నెర్నూరు భూసమస్యను పరిష్కరించండి

గూడూరు మండలంలోని నెర్నూరులో ఎస్టీ కుటుంబాలు, గ్రామస్థులకు మధ్య నెలకొన్న భూవివాదాన్ని పరిష్కరించాలని తెలుగుదేశంపార్టీ నాయకులు తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మను కోరారు. సోమవారం నాడు ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా పలు గ్రామాల్లోని సమస్యలపై తహశీల్దార్‌కు విన్నవించారు. వివాదాస్పద భూముల సర్వేను సకాలంలో చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తహశీల్దార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు, మధురెడ్డి, నాగేశ్వరరావు, రఘురామయ్య, జగదీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం కోసం నిరాహారదీక్షలు



విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని కోరుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో సోమవారం నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర షెడ్యూల్ కులాల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య మాట్లాడుతూ విద్యుత్‌శాఖ స్టోర్సులో మజ్దూర్ వర్కర్లుగా 1974 నుంచి పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ద్రోహం చేస్తూ కేవలం పెత్తందారులు విడిగా ట్రేడ్ యూనియన్ పెట్టుకొని సమస్యని విభజన చేయకుండా బలప్రయోగంతో అడ్డుకొంటున్నారని తెలిపారు. నెల్లటూరు గ్రామంలో నిర్మించిన స్టోర్సు వద్ద ముఠా వర్కర్లుగా చేయగా ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యం చేస్తున్నారని, వెంటనే వారికి న్యాయం చేయాలని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భీమారావు అంబేద్కర్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు దళితబాబు, దళిత మహాసభ జిల్లా నాయకులు జయరాజు, దాసరి విజయ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు మందా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశంపార్టీ ధ్యేయం



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్‌రావు, జ్యోత్స్నలత, పొనకా దేవసేన, కౌన్సిలర్లు

కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ప్రధాన ధ్యేయమని మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. గూడూరులో ఆదివారం నాడు జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఒకేమాట, ఒకే బాటలో కార్యకర్తలు పయనించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల వెనుక ఎన్టీఆర్ స్ఫూర్తి ఉందన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ రాధాజ్యోత్స్నలత మాట్లాడుతూ రైతుల కన్నీరు తుడిచేందుకే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ పేదల పార్టీ తెలుగుదేశంపార్టీ అని కొనియాడారు. జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నినాదాలు చేశారు. అనంతరం ప్రాంతీయ వైద్యశాలలోని రోగులకు పండ్లు రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశంపార్టీ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా... హుషారుగా 5కె రన్



సింహపురి మహిళా క్రీడా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులో రాష్ట్ర స్థాయిలో 5కిలోమీటర్ల పరుగుపందెం ఆదివారం నిర్వహించారు. మొట్టమొదటిసారిగా నెల్లూరులో జరిగిన 5కె రన్ నెల్లూరు నగరం పొదలకూరురోడ్డులోని కొత్తూరు రామకోటయ్యనగర్ పెట్రోలు బంకు నుండి ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వరకు సాగింది. 5కెరన్‌ను జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకనాథ్, నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్.కె.యతిరాజ్ జెండా వూపి ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 200మంది అథ్లెట్లు హాజరయ్యారు. జిల్లా పిఇటిల సంఘం అధ్యక్షకార్యదర్శులు కృష్ణారెడ్డి, సనత్‌కుమార్, రాష్ట్ర పిఇటిల సంఘం ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. డాక్టర్ ఎ.శారదాదేవి, వై.రవీంద్రమ్మ, డాక్టర్ రాధిక, కె.కుసుమకుమారి, ఎల్.శిరీష, ఎం.సుకేశిని, షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

## పన్నులకు ముందర... పనులకు చివర?



నగరపాలక సంస్థ వారు పన్నులు వసూలుకు చేస్తున్నంత శ్రద్ధ, ప్రజల సమస్యల పరిష్కారానికి మాత్రం చూపడం లేదని, ప్రజల ఇళ్ళ వద్దకు వెళ్ళి నానా రభస చేసి ఎలా పన్నులు వసూలు చేస్తున్నారో, అదేవిధంగా ప్రజలకు సంబంధించిన పనులు కూడా చేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన నగరంలోని 11వ డివిజన్‌లో వున్న ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు వసూలు చేయడంలో తప్పు లేదని, నగరాభివృద్ధికి పన్నులు అవసరమని పేర్కొంటూ, అయితే పన్నుల వసూళ్ళలో వున్న శ్రద్ధ ప్రజల పనులు నెరవేర్చడంలో కూడా వుండాలని చురకంటించారు. ఎన్టీఆర్ కాలనీ ప్రజలు అనేక అవస్థలతో జీవిస్తున్నారని, ఇక్కడ కాలువలు శుభ్రం చేసే నాధుడు లేరని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువుల రాకపోకలుంటాయి. తీవ్ర అనారోగ్యం కాకపోయినా, అనారోగ్య బాధలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా సాగినా నెరవేర గలవు. ప్రభుత్వ అధికారుల వత్తిళ్లు వ్యాపారులు ఉద్యోగులపైన ఉంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు, కొత్త పెట్టుబడులకు అవకాశాలు చేజారిపోవచ్చును. ఖర్చుల పెరుగుదల తప్పనిసరి. అనవసర విషయాలలో తలదూర్చవద్దు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికంగా వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. రాబడి పెరుగుతుంది. సభలు సమావేశాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులకు చిన్నచిన్న ఇబ్బందులు రావడం వల్ల టెన్షన్‌గా ఉంటుంది. కుటుంబ సభ్యుల వల్ల సమస్య బాధలుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు. ఉద్యోగులకు పనిభారం బాగుంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ప్రభుత్వ అనుమతులు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ఉద్యోగులపై, వ్యాపారులపై పైఅధికారుల వత్తిడి, తనిఖీలుండగలవు. తొందరపాటు ప్రవర్తన, తొందరపాటు మాటలు ఉండకుండా జాగ్రత్త పడండి. వ్యాపారాభివృద్ధికి చేసే ప్రయత్నాలు మంచి ఫలితాల నివ్వగలవు. విద్యా ప్రగతి బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వ్యవహారాలలో అయినవారి వల్లనే సమస్యలుంటాయి. ఉద్యోగార్థులు దీక్షగా ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆదాయం తగ్గుతుంది. మంచి వ్యాపార అవకాశాలు ఆర్థికావకాశాలు చేజారిపోతాయి. కుటుంబ ఖర్చులు పెరగడం, బంధువుల రాకపోకలు పెరగడం, అనుకున్న పనులు హడావిడిగా పూర్తి చేయడం జరుగుతుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 03.04.2015 నుండి**
**తేది. 09.04.2015 వరకు**

ఈ వారం మీనంలో రవి బుధ కేతువులు, మేషంలో కుజుడు శుక్రుడు, 6తేది నుండి వృషభంలో శుక్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 4.4.2015 శనివారం సాయంకాలం గంట 5.24 నుండి గంట 7.15 వరకు చంద్రగ్రహణము. ఉత్తర హస్త చిత్ర నక్షత్రముల వారు గ్రహణము చూడకుండుట మంచిది.

ముహూర్తములు లేవు.

### చైత్ర మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 03 | శుక్ర | చతుర్దశి | సా॥ గం.2.46వ॥ |
| తేది. 04 | శని | పూర్ణిమ | సా॥గం.4.41వ॥ |

### చైత్ర మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 05 | ఆది | పాడ్యమి | సా॥గం.6.18వ॥ |
| తేది. 06 | సోమ | విదయ | రా॥గం.7.33వ॥ |
| తేది. 07 | మంగళ | తదియ | రా॥గం.8.10వ॥ |
| తేది. 08 | బుధ | చతుర్థి | రా॥గం.8.29వ॥ |
| తేది. 09 | గురు | పంచమి | రా॥గం.8.12వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వస్తు, వాహన గృహ రిపేర్లుంటాయి. కుటుంబంలో అనుకూలత తక్కువగా ఉండవచ్చును. అనుకున్న పనులు జరగడానికి బాగా శ్రమ పడాలి. ఏదో ఒక రూపంలో ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారములందు ఆశించిన ఆదాయముండును. తొందరపాటు ప్రవర్తన వల్ల అవకాశాలు చేజారిపోవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

షేర్లు పెట్టుబడుల మీద కొద్ది లాభాలుంటాయి. యజమానులకు పనివాళ్ళతో ఇబ్బందులుండగలవు. మీ నుండి దూరమైన వారే మరల మీతో సన్నిహితంగా ఉండటానికి ప్రయత్నాలు చేస్తారు. ప్రయాణాలు తప్పక ఉంటాయి. ముఖ్య అవసరానికి అప్పు చేయవలసి రావచ్చు. కుటుంబ సామరస్యం, విద్యాప్రగతి బాగుంటుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2పాదాలు

రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు స్థాన చలనము గాని అదనపు బాధ్యతలు గాని ఉంటాయి. శరీరానికి గాయాలు తగలకుండా చూచుకొనండి. వ్యాపార భాగస్వామ్యాలు, లీజులు ఏజెన్సీలు లభించే అవకాశమున్నది. ఆదాయం సంతృప్తికరం. కాని అనుకోని ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. చేపట్టిన పనులను సంతృప్తికరంగా పూర్తి చేస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకోని అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. అనుకోని ఖర్చులు పైనబడే అవకాశమున్నది. అన్ని పనులు ఒంటరిగా చేయవలసిన పరిస్థితి ఉంటుంది. టెన్షన్‌గా ఉన్నా సమర్థవంతంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు, పెట్టుబడులు పెట్టే ప్రయత్నాలు వాయిదా వేసికొనండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబ వ్యవహారాలలో కొద్దిపాటి చికాకులుండి సర్దుబాటు కాగలవు. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకొంటారు. చక్కని నిర్ణయాలతో చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలు, వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయ వృద్ధి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది. విద్యార్థులకు చదువుపై మరింత శ్రద్ధ అవసరం.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

షేర్లు స్థిరాస్తులపై లాభాలుంటాయి. ప్రముఖులతో పరిచయాలు దూరప్రయాణాలుండగలవు. నిరుద్యోగులకు అవకాశాలు లభించవచ్చును. కుటుంబ సభ్యుల వల్ల చిన్నచిన్న వ్యవహార సమస్యలు రావచ్చును. మిమ్మల్ని కాదనిన వారే మరల మీకు సన్నిహితం కాగలరు. ఉపాధి పథకాలు, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆదాయం కొద్దిగా పెరుగుతుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. పుణ్య కార్యాలు, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పెండింగ్‌లో వున్న పనులు మరల కొనసాగుతాయి. బంధుత్వాలు పరిచయాలు బలపడతాయి. అనుకున్న పనులు ఏదో ఒక రీతిలో సాధించుతారు. వ్యాపార, వృత్తి జీవనం కలవారికి మంచి అవకాశాలు లభించి, ఆదాయం పెరుగుతుంది. షేర్లు మీద లాభాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉంటుంది. తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టపడే అవకాశం ఉన్నది. ముఖ్య వ్యవహారాలలో నిర్ణయాలు చేయలేక సతమతము కాగలరు. చేపట్టిన పనులు ఆటంకాలతో నిదానంగా జరుగుతాయి. ఖర్చుల భారం పెరుగుతుంది. పెద్దలను సందర్శించడం, దైవ కార్యాలలో పాల్గొనడం జరుగుతుంది.


మనసున్న మారాజు

మా పెద్దాయనకు స్మృత్యంజలి

మా అభివృద్ధికి అండగా
మా కష్టాలలో తోడుగా
మా సుఖాలలో నీడగా

నిత్యం తన అపురూపమైన ఆశీస్సులతో
అపారమైన ప్రేమాభిమానాలతో
మమ్ము వెన్నంటి వుండి ముందుకు నడిపించిన
మా "పెద్దాయన"
దైవ సన్నిధికి చేరినా...

మా ఇంటిలో దీపమై
మా కంటిలో వెలుగై
మా జీవితాలలో భాగమై
మాతోనే వున్నారు... ఎప్పటికీ వుంటారు.

వారి దివ్య స్మృతిలో...

షేక్ రియాజ్ భాషా
రియాజ్ హైదరాబాద్ లైటింగ్ హౌస్ & హైరర్స్
మాగుంట లే అవుట్, నెల్లూరు.



శ్రీ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు
అధినేత - సిపిఆర్ కల్యాణ మండపం, శివప్రియ లాడ్జి

# సాయి దర్బార్‌లో శ్రీరామ నవమి వేడుకలు



శ్రీ సాయినాధుని జన్మదినోత్సవం, శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని, నెల్లూరు బాలాజీనగర్‌లో వున్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఆదివారం స్వామివార్లకు కన్నుల పండువగా ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల దాకా సాయినాధుని అఖండ శ్రీ సాయినామ సంకీర్తన చేశారు. సాయినాధునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, ధ్యానమందిరంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాధుని నామ జపంతో, శ్రీరామ నామ జపంతో ఆలయం మార్మోగింది. ఈ సందర్భంగా, షిరిడీ సంప్రదాయాన్ని చాటుతూ శ్రీ సాయినాధ మూర్తిని పూలరథంపై వుంచి, వెండి పల్లకిలో నగరోత్సవం నిర్వహించారు. విశేష పుష్పాలంకరణలతో, మేళతాళాలతో గంధ మహోత్సవం, శ్రీ సాయినామ సంకీర్తన నగరోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివార్ల ఉత్సవాలను ఆద్యంతం తిలకించి పులకించిపోయారు. సాయిబాబా అద్దాల మందిరం ఛైర్మెన్ మధుసాయి, శ్రీ సాయి దర్బార్ ట్రస్ట్, సత్సంగ్ సేవాదళ్ సభ్యులు ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు.



**భక్తులతో కిటకిటలాడిన సాయిసదన్ :**

అదేవిధంగా, చిల్డ్రన్స్ పార్కు వద్ద వున్న శ్రీ సాయిసదన్ సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో బాబా పుష్పపల్లకి, గంధమహోత్సవం, నగరోత్సవాలు వైభవంగా జరిగాయి. సాయిసదన్ సాయిబాబా మందిర వ్యవస్థాపకులు, సాయినాధుని భక్తుడు కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఈ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో సాయిసదన్ కిటకిటలాడింది.

## బలైన బత్తిబాబు

(మొదటిపేజీ తరువాయి)

స్నేహంగా ఉండేవాడు. అతని క్లాసులోనే పవన్, రేవంత్, సమరసింహారెడ్డి, సాయితేజ అనే వాళ్లుండేవాళ్లు. ఈ నలుగురికి కూడా క్లాసులో బ్యాడ్‌రిమార్కు వుండేది. బత్తిబాబు వీళ్లతో ఎప్పుడూ కలిసేవాడు కాదు.

**ఘోరానికి దారి తీసిందిలా...**

కాగా పవన్, రేవంత్, సమరసింహారెడ్డి, సాయితేజలు ఇటీవల వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌లు చూడడానికి అయ్యప్పగుడి ప్రాంతంలోని డివిఆర్ ప్యారడైజ్ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసాక అక్కడే మందు, మాంసంతో పార్టీలు చేసుకున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ బెట్టింగ్‌లు పెట్టుకున్నారు. ఇక రూం ఖాళీ చేయాల్సి వచ్చేసరికి వాళ్ల వద్ద డబ్బులు లేకుండా పోయాయి. బెట్టింగ్‌లతో అప్పుల పాలయ్యారు. దీంతో డబ్బును ఎలా రాబట్టాలనే దానిపై దృష్టి పెట్టారు. వారి విషయు ఆలోచనలకు బత్తిబాబు గుర్తొచ్చాడు. బత్తిబాబును కిడ్నాప్‌చేసి వారి తల్లిదండ్రులను బెదిరించి రెండులక్షల రూపాయలు రాబట్టాలనుకున్నారు. బత్తిబాబును కిడ్నాప్ చేసి నరసింహకొండ అడవుల్లో వుంచి ఇద్దరు కాపలా వుంటే మరో ఇద్దరు బత్తిబాబు తండ్రి ఆదినారాయణకు ఫోన్ చేసి మీ కొడుకును కిడ్నాప్ చేసాం, రెండు లక్షలు తీసుకుని మేం చెప్పిన చోటకు వస్తే మీ కొడుకును వదిలేస్తాం అని బెదిరించాలనుకున్నారు. ఈమేరకు ప్లాన్ సిద్ధం చేసుకున్నారు. మార్చి 25వ తేదీన బత్తిబాబు తన కుటుంబసభ్యులతో తిరుమల నుండి నెల్లూరు వచ్చాడు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో చేరడానికి అప్లికేషన్ కోసం బత్తిబాబు ఇంటర్‌నెట్ సెంటర్ వద్దకు వెళ్లాడు. తిరుమల దగ్గర నుండి బత్తిబాబు రాకను తెలుసుకుంటున్న పవన్ ఇంటర్‌నెట్ సెంటర్ వద్దకు వెళ్లాడు. నరసింహకొండ వద్ద రోహిత్ బండి చెడిపోయిందని, అక్కడి దాకా డ్రాప్ చేయమని తీసుకెళ్లాడు. నరసింహకొండ దాటాక పొదల మాటుకు తీసుకెళ్లారు. అప్పటికే మిగతావాళ్లు అక్కడ ఓ నైలాన్ తాడుతో సిద్ధంగా ఉన్నారు. ఓ ఇద్దరు బత్తిబాబు చేతులను వెనక్కు విరిచి కట్టేసారు. ఈ సమయంలో బత్తిబాబు చేతి కట్లు విడిపించుకుని పరుగెడుతుండగా, పవన్ ఒక రాయిని తీసుకుని తల వెనుక వైపు బలంగా కొట్టాడు. దాంతో బత్తిబాబు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే రేవంత్ కూడా మరో రాయితో అక్కడే కొట్టడంతో బత్తిబాబు కుప్పకూలిపోయాడు. బత్తిబాబు బ్రతికితే తమ గుట్టు తెలిసిపోతుందని భావించిన ఆ నలుగురు కిరాతకులు రాళ్లతో బత్తిబాబు తలపై, కళ్లపై బలంగా కొట్టి చంపారు. తర్వాత బత్తిబాబు వేలికున్న వజ్రపుటుంగరం, అతని బైక్, సెల్‌ఫోన్ తీసుకుని వచ్చేసారు. బైక్‌ను ఇరుకళల పరమేశ్వరి గుడి ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో వదిలేసారు. సమరసింహారెడ్డి, రేవంత్, సాయితేజలు హోటల్‌కెళ్లి బట్టలు మార్చుకుని పాత బట్టలను కాల్చేసారు. పవన్ మాత్రం ఒంగోలులో వున్న తన మిత్రుడికి వేరే వ్యక్తి ఫోన్ నుండి ఫోన్ చేసి తాను ఒంగోలుకు వస్తున్నానని, తన వద్ద వజ్రపుటుంగరం ఉందని, తాకట్టు పెట్టాలని చెప్పాడు. అతను ముత్తూట్ ఫైనాన్స్‌లో నాకు ఖాతా వుందని, అక్కడ తాకట్టు పెడదామని చెప్పడంతో పవన్ ఒంగోలుకు వెళ్లాడని తెలిసింది.

ఇంటర్నెట్ సెంటర్‌కు వెళ్లి వస్తానన్న కొడుకు ఎంతకూ రాకపోవడంతో బత్తిబాబు తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. బత్తిబాబు కోసం వెదకడం మొదలుపెట్టారు. బత్తిబాబు మిత్రులను సంప్రదించి కొంతవరకు సమాచారం రాబట్టారు. బత్తిబాబు అదృశ్యం వెనుక పై నలుగురి హస్తం వుందని గుర్తించారు. వీరు బస చేసిన హోటల్‌లో విచారించారు. పవన్ ఒంగోలుకు ఫోన్ చేసి మాట్లాడినప్పుడు అతనికి ఫోన్ ఇచ్చిన వ్యక్తి వాయిస్ రికార్డర్ ఆన్ చేసి వున్నాడు. దాంతో పవన్ మాట్లాడిందంతా ఆ ఫోన్‌లో రికార్డై వుండింది. ఆ రికార్డు వాయిస్ వినడంతో తమ బిడ్డకు ఏదో కీడు జరిగి వుంటుందని బత్తిబాబు తల్లిదండ్రుల మనసు శంకించింది. బత్తిబాబు ఫోన్‌కు వచ్చిన కాల్స్ ఆధారంగా రేవంత్, సమరసింహారెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుప్తనిధుల కోసం పవనే బత్తిబాబును చంపుతానని తమతో చెప్పాడని, అతనే ఏమైనా చేసి ఉండొచ్చంటూ ముందు కట్టుకథలు అల్లారు. తర్వాత పోలీసు శైలిలో విచారించడంతో బత్తిబాబు మృతదేహం ఎక్కడ వున్నది తెలిపారు. పరారీలో వున్న పవన్‌ను కూడా పోలీసులు ఒంగోలులో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించడంతో ఈ దురాగతమంతా బయటపడింది. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు కాగా ముగ్గురు పోలీసుల అదుపులో వున్నట్లు సమాచారం. 1వ తేదీకి మరో నిందితుడు సాయితేజ పట్టుబడలేదు. ఈ సమాచారాన్ని ఇంతవరకు విచారణ కోసం పోలీసులు కూడా బయట పెట్టలేదు. కాని డబ్బుకు ఆశపడే కిడ్నాప్ కుట్ర పన్ని ఈ నలుగురు కిరాతకులు బత్తిబాబును పొట్టన పెట్టుకున్నారని తెలుస్తుంది. ఇది మాటలకందని దురాగతం. 17ఏళ్ల వయసులో, చదువు సంస్కారం నేర్చుకోవాల్సిన తరుణంలో క్రూరంగా హత్యలు చేస్తున్నారంటే ఈ సమాజం ఎటుపోతుందనుకోవాలి? భావిభారతాన్ని నిర్మించే పౌరులు, భారతావని కోరుకుంటున్న మేధావులు వీళ్లేనా? ఇలాంటి కిరాతకులకు ఎలాంటి శిక్ష వేసినా తక్కువే!

## జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
# 5న సాహితీ పురస్కారాలు

నెల్లూరులోని జిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదిన పలువురికి పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షులు, ప్రముఖ కవి గుర్రాల రమణయ్య తెలిపారు. తన సతీమణి దివంగత గుర్రాల రమణమ్మ స్మారకంగా ఈ ట్రస్ట్ ఏర్పాటుచేశామని, గత కొద్ది సంవత్సరాలుగా ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో, వివిధ రంగాల్లో విశిష్టసేవలు అందిస్తున్న పలువురికి పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈనెల 5న జరిగే సాహితీపురస్కారాల ప్రదానం కార్యక్రమంలో సాహితీ కిరణం మాసపత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, ప్రముఖ కవులు మాధవీ సనారా (అనకాపల్లి), కవి నాగేశ్వరరావు (కోవూరు), డా. ఇమ్మిడిశెట్టి చక్రపాణి (అనకాపల్లి), బత్తుల బ్రహ్మయ్య (జగ్గయ్యపేట), మాధవీ సనారా (అనకాపల్లి), ప్రముఖ కవయిత్రులు మందరపు హైమవతి (విజయవాద), నల్లూరి సుశీలాదేవి (నెల్లూరు), ప్రముఖ న్యాయవాదులు సూరి దయాకరరెడ్డి (నెల్లూరు), ఐవి రామిరెడ్డి (కావలి), జిల్లా మలేరియా కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.వెంకమరాజులకు ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటయ్యే సభలో ప్రముఖ కవులు, కవయిత్రులు డాక్టర్ జయప్రద, యద్దల లలిత, వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకులు ఆచార్య ఆదిత్య, సిరిమామిళ్ళ కోటేశ్వరరావు, బి.వి సురేష్‌కుమార్, సర్వేపల్లి రామ్మూర్తి, డాక్టర్ జి. మురళీధర్ (ప్రముఖ మానసిక వైద్యులు-నెల్లూరు) తదితరులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, సాహితీవేత్తలు, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ఎస్పీని కలిసిన జిల్లా పోలీసు సంఘం



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన గజరావు భూపాల్‌ని జిల్లా పోలీసు అధికారుల సంఘం సభ్యులు మార్చి 27వ తేదీన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులందరూ తమను తాము ఎస్పీకి పరిచయం చేసుకున్నారు. ఒకసారి అసోసియేషన్ కార్యాలయానికి రావాల్సిందిగా వారు ఎస్పీని కోరారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.గంగాధర్, రాష్ట్ర కో-ఆప్షన్ సభ్యులు శివప్రకాష్, జిల్లా అధ్యక్షులు మద్దిపాటి ప్రసాదరావు, కార్యదర్శి బి.జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, కోశాధికారి బాబు, సభ్యులు వరప్రసాద్, వీరాంజనేయులు, పరమేశ్వరిలు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

## చినబాబు "రాజ్యం"

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించడమేకాక అభ్యర్థుల ఎంపికలోనూ చొరవ చూపాడు. ఇక ఎన్నికలప్పుడు ఆర్థిక నిర్వహణ అంతా కూడా లోకేష్ చేతుల మీదుగానే జరిగినట్లు సమాచారం.

రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక లోకేష్ ప్రాధాన్యత పెరిగిపోయింది. చంద్రబాబు కంటే కూడా చినబాబును కలిస్తే తొందరగా పనులైపోతున్నాయనే ప్రచారం కూడా వుంది. మంత్రివర్గ ఎంపికలో కూడా లోకేష్ హస్తమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాగా వేడిమీదున్న పట్టిసీమ ప్రాజెక్ట్ తెరమీదకు రావడానికి కారణం కూడా లోకేషేనేది విశ్వసనీయ సమాచారం. రాజధాని ప్రాంతం ఎంపికలోనూ, భూసమీకరణ విషయంలోనూ లోకేష్ పాత్ర వుంది.

ఇక రాష్ట్రంలో ఉన్నతాధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు, నాయకులకు నామినేటెడ్ పదవుల వంటి వ్యవహారాలన్నీ కూడా లోకేష్ చూస్తున్నారు. రాబోయే రోజుల్లో చంద్రబాబు కంటే చినబాబు ముద్రే పార్టీ మీద ఎక్కువగా ఉండబోతుందని తెలుగుదేశం వర్గాలే వ్యాఖ్యానిస్తుండడం విశేషం.

## మిస్సయిన మస్తాన్‌బాబు

(మొదటిపేజీ తరువాయి)

రెపరెపలాడించాడు. 172రోజుల్లోనే ఏడు ఖండాలలో వున్న ఎత్తైన పర్వతాలను ఎక్కి గిన్నీస్ రికార్డు సృష్టించాడు. ఇటీవల చిలీలోని ఆండీస్ పర్వతారోహణకు వెళ్లాడు. అయితే మార్చి 25వ తేదీన ఇక్కడ సంభవించిన తుఫాన్‌తో మల్లి మస్తాన్‌బాబుకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. 28వ తేదీకి గాని కుటుంబసభ్యులకు ఈ విషయం తెలియలేదు. కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మస్తాన్‌బాబు ఆచూకీ గల్లంతుపై స్పందించింది. చిలీలోని భారత రాయబారి అక్కడి ప్రభుత్వంతో సంప్రదించి గాలింపు చర్యలు ముమ్మరం చేసారు. ఇక మల్లి మస్తాన్‌బాబుతో కలిసి చదువుకుని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాలలో స్థిరపడిన అతని స్నేహితులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే ఫేస్‌బుక్ ఖాతాలను ప్రారంభించి అతని ఆచూకీకి సహాయ చర్యల నిమిత్తం విరాళాలు కూడా సేకరించారు. చిలీ ప్రభుత్వం కూడా ప్రత్యేకశ్రద్ధతో మస్తాన్‌బాబు ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తోంది. ఈ ప్రయత్నాలు ఫలించి మస్తాన్‌బాబు సజీవంగా, సురక్షితంగా తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిద్దాం.

# సింగపూర్ రాజధాని పార్ట్-1 ప్రారంభం

శ్రీను గల్పిక

ఉద్యమ టెర్రర్ కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాజ్యమేలుతుండగా మరో ముఖ్యమంత్రి చంద్రబాబు తలదాచుకుంటున్న హైదరాబాద్ నగరం. చంద్రబాబు నిద్రలేచి వ్యక్తిగత కార్యక్రమాలు పూర్తి చేసుకున్నాడు. అప్పుడే చీఫ్‌సెక్రటరీ ఐ.వి.కృష్ణారావు లోపలకు వచ్చాడు. చంద్రబాబు వుండి... కృష్ణారావు గారు... ఇంకా మనం వేటివేటి మీద ఆదాయం పిండవచ్చు అని అడిగాడు. దానికి కృష్ణారావు... మనం ఇప్పటికి పెంచిన ఛార్జీలు చాలా తక్కువ సార్, కరెంట్ ఛార్జీలు, ఆస్థి పన్నులు వంటివి మాత్రమే పెంచాం. ఇంకా మనం ఆదాయం పెంచుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ఇందులో మనం ఔరంగజేబు వంటి దార్శనిక పాలకులను ఆదర్శంగా తీసుకోవాలి. ప్రతి బార్బర్‌షాప్‌లో హేర్‌కటింగ్, లేదా షేవింగ్ చేయించుకునే వారిపై పన్ను విధించవచ్చు. అలాగే ప్రతివ్యక్తి అవసరాల మీద పన్నులు వేసుకుంటూపోవచ్చు. నిద్రలేస్తే ఒకరకం పన్ను, పళ్లు తోమితే పన్ను, బాత్రూంకు పోతే ఒకరకం ఛార్జి, స్నానానికి నీళ్లు వాడుకుంటే వాటర్‌టాక్స్, టిఫిన్ టాక్స్, భోజనం టాక్స్, రాత్రి నిద్రపోవాలన్నా టాక్స్, పెళ్లి చేసుకోవాలన్నా, శోభనం చేసుకోవాలన్నా, బిడ్డను కనాలన్నా... ఇలా జనాలకు టాక్స్‌లు కట్టే ఓపిక ఉండాలేగాని ఎన్నిరకాల టాక్స్‌లైనా వేయొచ్చు సార్ అని చెప్పాడు. వెంటనే చంద్రబాబు... టాక్స్‌లు కట్టే ఓపిక ఈ ఐదేళ్లలోనే ప్రజలకు వచ్చేటట్లు నేను చేస్తాను కదా అని చెప్పి టీవీ ఆన్ చేసి ఏ ఫర్ బి న్యూస్ ఛానెల్ పెట్టాడు. దాంట్లో అప్పుడే "ఉదయకృష్ణ హృదయంలో" అనే ప్రోగ్రామ్ వస్తుంది. ఉదయకృష్ణ చంద్రబాబుతో అంతకుముందురోజు చేసిన ఇంటర్వ్యూ అప్పుడే ప్రసారమవుతుంది. చంద్రబాబు హృదయంలో ఉన్నది ఉన్నట్లు చెప్పడం ఈ ప్రోగ్రామ్‌లోని అంతరార్థం. ప్రోగ్రామ్ ముందు పది వాణిజ్య ప్రకటనలు వేసారు. తర్వాత చంద్రబాబు హృదయంలో మాటను ఉదయకృష్ణ వెలికి తీయడం మొదలుపెట్టాడు.

**ఉదయకృష్ణ:** చంద్రబాబు గారు... మీరు సీఎం అయిన ఈ 10నెలల్లోనే అద్భుతంగా పాలించారు. మీ పాలనా పటిమ ముందు ప్రధాని నరేంద్ర మోడీ పనితీరు కూడా బలాదూర్ అనిపిస్తుంది. మీరు ఇంత చక్కగా ఎలా పరిపాలించగలుగుతున్నారండి... మిమ్మల్ని చూస్తుంటే నాకే అసూయగా వుంది!

**చంద్రబాబు:** వంద హిట్ సినిమాలు తీసిన వాడికి 101వ సినిమాను హిట్ చేయడం పెద్ద లెక్క కాదు. ఇంగ్లీష్ ఛానల్‌ను ఈదిన వారికి హుస్సేన్‌సాగర్‌లో ఈత కొట్టడం పెద్ద పనేం కాదు. వరల్డ్ కప్ క్రికెట్‌లో సెంచరీలు కొట్టినోడికి గల్లీ క్రికెట్ ఆడడం పెద్ద కష్టం కాదు. అలాగే గతంలో 9ఏళ్లు ప్రపంచమంతా మెచ్చుకునేలా పరిపాలించిన నాకు ఈ పదినెలల్లో మంచిపేరు తెచ్చుకోవడం పెద్ద గొప్పేమీ కాదు.

**ఉదయకృష్ణ:** ఈమధ్య ఓ సభలో ఈ దేశంలో నన్ను మించిన నాయకుడు లేడని మీకు మీరు చెప్పుకున్నారు. అలా మిమ్మల్ని మీరు కించపరచుకోవడం సబబుగా ఉందా?

**చంద్రబాబు:** కించపరచుకోవడమేమిటి... అది నిజమేగా... దేశంలో నన్ను మించిన నాయకుడెవరున్నాడో చూపించండి.

**ఉదయకృష్ణ:** (కోపంగా...) ఇది కించపరుచుకోవడం కాక ఇంకేమిటి, ఆఫ్టాల్ మిమ్మల్ని మీరు దేశ నాయకులతో పోల్చుకుంటారా... అసలు మీతో పోలిస్తే నరేంద్ర మోడీ, నితీష్‌కుమార్, శివరాజ్ సింగ్‌చౌహాన్, నవీన్ పట్నాయక్... వీళ్లు నాయకులేనా? మీరు పోల్చుకోవాల్సింది అబ్రహంలింకన్, మార్టిన్ లూథర్‌కింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, బరాక్ ఒబామా, వాజ్‌పేయి వంటి వారితో సార్. ఇంకెప్పుడూ చీప్‌గా ఇండియన్ నాయకులతో పోల్చుకోవద్దు. మమ్మల్ని హర్ట్ చేయొద్దు!

**చంద్రబాబు:** సారీ ఉదయకృష్ణ. నాస్థాయి అదేనని తెలుసు... కాని నా అంతట నేను చెప్పుకుంటే బాగుండదు కదా, ఇలాంటి నిజాలను ప్రపంచం దృష్టికి మీరే తీసుకెళ్లాలి.

**ఉదయకృష్ణ:** ఓకే సార్, తప్పకుండా. మేం ఛానెల్ పెట్టిందే ఇలాంటి పచ్చినిజాలను ప్రపంచానికి చెప్పడానికి!

**చంద్రబాబు:** ఉదయకృష్ణ గారు... ఇప్పుడు మీ హృదయంలో ఉన్న మాటను చెప్పండి... రాష్ట్ర ప్రజలు మా పరిపాలన గురించి ఏమనుకుంటున్నారు?

**ఉదయకృష్ణ:** అమృతాన్ని తాపించి, దాని రుచి అడిగినట్లుగా వుంది మీ ప్రశ్న? అమృతం రుచికి ఎవరైనా వంకలు పెట్టగలరా?

**చంద్రబాబు:** అసెంబ్లీ సమావేశంలో నాతో సహా మా పార్టీ సభ్యుల పెర్‌ఫార్మెన్స్ ఎలా వుంది?

**ఉదయకృష్ణ:** సూపర్ సార్, అసలు సబ్జెక్ట్ అనేది లేకుండా, సమస్యల మీద చర్చించకుండా కేవలం చనిపోయిన వాళ్లను తిడుతూ రోజుల తరబడి సమావేశాలు నిర్వహించవచ్చునని మీ సభ్యులు నిరూపించారు. నటసామ్రాట్, నటకిరీటి, నటచక్రవర్తి, నటరత్న, నటభూషణ్, నటవిశ్వవిఖ్యాత... ఈ బిరుదులన్నీ కూడా మీకు, మీ సభ్యులకే ఇవ్వొచ్చు. ఇంతకీ రాజధాని ప్రోగ్రస్ ఎంతవరకు వచ్చింది.

**చంద్రబాబు:** సింగపూర్ వంటి రాజధాని నిర్మించాలనుకుని ఇప్పటికి నాలుగుసార్లు సింగపూర్ పోయి వచ్చాను. సింగపూర్ కంపెనీ వాళ్లు కూడా నాలుగుసార్లు వచ్చి వెళ్లారు. ఈ విధంగా సింగపూర్‌కు మనకు మధ్య రాకపోకలు మొదలయ్యాయి. సింగపూర్ రాజధానికి విరాళాలివ్వాలంటూ ప్రజలకు పిలుపునిచ్చాము. ఉద్యోగులు ప్రతినెలా ఒకరోజు జీతం విరాళంగా ఇవ్వాలని చెప్పి ఉన్నాం, ఇక ప్రజలైతే మూడుపూటలా తిండితినే వాళ్లు ఒక పూట మానుకుని ఆ మిగిలిన డబ్బును రాజధానికి విరాళంగా ఇవ్వాలి. మనం ఒకరోజు తిండి లేకపోయినా ఉండగలం, ఒక వారం స్నానం చేయకపోయినా బ్రతకగలం. కాని సింగపూర్ వంటి రాజధానిని కట్టుకోకుండా ఉండలేం కదా?

**ఉదయకృష్ణ:** రాజధానిపై మీరు పడుతున్న తపన, కష్టం, శ్రమ, బాధా, పట్టుదల చూస్తుంటే ఖచ్చితంగా ప్రపంచానికే రోల్‌మోడల్‌లా ఉండే రాజధానిని కట్టి తీరుతారనిపిస్తుంది. సింగపూర్ రాజధాని విషయంలో మనం ఎంత ముందుకుపోయాం?

**చంద్రబాబు:** మనం చాలాముందుకు పోయాం. రాజధాని నిర్మాణంలో పార్ట్-1, పార్ట్-2 అని రెండు దశలను తీసుకుంటున్నాం. సింగపూర్‌లో లేనివి ఏమిటి అనేది పార్ట్-1, ఉన్నవి పార్ట్-2. మొదట పార్ట్-1 మొదలుపెడుతున్నాం. సింగపూర్‌లో పంటపొలాలు ఉండవు, పచ్చదనం కనిపించదు. కాబట్టి మనం రాజదానిగా ఎంచుకున్న తుళ్లూరు ప్రాంతంలో కూడా పంటలు, పైర్లు లేకుండా చేస్తాం. సింగపూర్‌లో రైతులు ఉండరు. తుళ్లూరులో కూడా పంటపొలాలు లేకుండా చేస్తే... ఇక్కడున్న రైతులు వలసపోతారు. సింగపూర్‌లో ఎద్దులు, ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు, పేడదిబ్బలు, రైతు కూలీలు కనిపించరు. కాబట్టి తుళ్లూరులో కూడా అవేమీ కనిపించకుండా చేస్తాం. సింగపూర్‌లో పూరిల్లు, రేకుల ఇళ్లు, చిన్నచిన్న మిద్దెలు కూడా వుండవు. తుళ్లూరులో కూడా అవేమీ లేకుండా చేస్తాం. సింగపూర్‌లో సాగునీటి కాలువలు, మంచినీటి బావులు, బోర్లు వుండవు. తుళ్లూరులో కూడా లేకుండా చేస్తాం. సింగపూర్‌లో పక్షులు, జంతువులు వంటివి కనిపించవు. తుళ్లూరులో అటువంటివి కూడా లేకుండా చేస్తాం.

**ఉదయకృష్ణ:** మరి పార్ట్-2 అంటే?

**చంద్రబాబు:** సింగపూర్‌లో ఉన్నవి ఇక్కడ కూడా పెట్టడం. 50, 60అంతస్థుల భవనాలు, నైట్‌క్లబ్‌లు, మాల్స్, అండర్‌గ్రౌండ్ ట్రైన్, పబ్‌లు, టూరిజం పార్క్‌లు... ఇలాంటివన్న మాట.

**ఉదయకృష్ణ:** పార్ట్-1 ఎప్పుడు పూర్తవుతుంది. పార్ట్-2 ఎప్పటికి చేయగలరో చెబుతారా?

**చంద్రబాబు:** పార్ట్-1 త్వరగానే పూర్తవుతుంది. ప్రస్తుతం ఆ పనిలోనే ఉన్నాం. దీనికి ఎవరి సాయం అక్కర్లేదు కూడా! ఇక పార్ట్-2 పూర్తి కావాలంటే కేంద్రం ఓ పదిలక్షల కోట్లన్నా ఇవ్వాలి. అలాగే ప్రజలు కూడా తమ ఆస్తులను రాజధానికి విరాళంగా ఇవ్వాలి. కేంద్రం, రాష్ట్ర ప్రజలు ఆ విధంగా సహకరిస్తే నేను ముందుకు పోగలను.

**ఉదయకృష్ణ:** చంద్రబాబు గారూ.. మీ ఆశయం తప్పకుండా నెరవేరుతుంది. సింగపూర్ రాజధాని పార్ట్-1పై నాకు అత్యంత నమ్మకముంది. పార్ట్-2 మీదే సందేహముంది. అయినా సాధించే సత్తా మీకుంది. బెస్టాఫ్‌లక్ సార్.

**చంద్రబాబు:** ఓకే ఉదయకృష్ణ, నా హృదయంలోని నిజాలను బయటపెట్టించినందుకు మీకు కూడా కృతజ్ఞతలు, ఇక శెలవు.

ఇక్కడితో ఇంటర్వ్యూ అయిపోయింది. చంద్రబాబు టీవీ కట్టేసి కొత్త పన్నుల గురించి ఆలోచిస్తూ సచివాలయానికి బయల్దేరాడు.




పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి

32 సంవత్సరములు నిండుతాయి.

ఈ సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు :

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు :

కట్టంరెడ్డి సంయుక్త

కేతిరెడ్డి ఉష

మరియు

కుటుంబసభ్యులు

శ్రీరస్తు　　శ్రీ గణేశాయ నమః　　శుభమస్తు

నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలం, కొత్తూరు

# శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల

# "5" రోజుల ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వానము





స్వస్తిశ్రీ! మన్మధనామ సంవత్సరం ఉత్తరాయణం చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి శనివారము నుండి
ఏకాదశి బుధవారం వరకు అనగా సరియగు తేది 11-04-2015 నుండి 15-04-2015 వరకు
నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామం నందు వెలసిన

**శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల**

"5" రోజుల ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమములు నెరవేర్చుటకు భగవంతుని అనుగ్రహంతో నిశ్చయించడమైనది.

## శ్రీ సాయిబాబా మందిర కార్యక్రమ వివరములు

**తేది 11-04-2015 శనివారం ఉదయం గం|| 8.00 లకు ప్రారంభం**

దేవతా ప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, దేవనాంది, దీక్షాకంకణ ధారణం, మహా సంకల్పం, కృచ్ఛాచరణ, ఋత్విక్ వరణ, అష్టమూర్తి ప్రార్థన, బ్రహ్మకూర్చహోమం, అథర్వశీర్ష గణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి

**సాయంత్రం గం|| 6.00ల నుండి రాత్రి గం|| 9.00ల వరకు**

గణపతిపూజ, మండలదర్శన, మండలారాధన, రాక్షోఘ్న పారాయణము, రాక్షోఘ్నహోమం, వాస్తుపూజ, స్వప్నకలశస్థాపన, మహాపూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మహా మంగళ హారతి

**తేది 12-04-2015 ఆదివారము ఉదయం గం|| 8.00ల నుండి గం|| 12.30ల వరకు**

గణపతిపూజ, స్వస్తిపుణ్యాహం, నవగ్రహ హోమం, శాంతిప్రాయశ్చిత్తహోమం, అధివాస హోమం, గణపతిమూల మంత్ర హోమం, దత్తాత్రేయ హోమం, అయ్యప్పహోమం, శ్రీ సాయిబాబా మూలమంత్రహోమం, కళావృద్ధి హోమం, వసోధారహోమం, మహాహుతి, పూర్ణకళాసానిధ్య, కుంభాభిషేకము, మహామంగళహారతి.

**సాయంత్రం గం|| 6.00 నుండి గం|| 8.30 ల వరకు**

శ్రీ షిర్డి సాయిబాబా వారి మహాపూజ, పల్లకీసేవ, అష్టావధానసేవ, మహా మంగళ హారతి.

## శ్రీ యోగాంజనేయ మందిర కార్యక్రమ వివరములు

**తేది 13-04-2015 సోమవారం ఉదయం గం|| 8.30 ల నుండి గం||12.00ల వరకు**

దేవతా ప్రార్థన, గణపతిపూజ, స్వస్తిపుణ్యాహం, మహాసంకల్పము, కృచ్ఛాచరణ, అష్టమూర్తి ప్రార్థన, బ్రహ్మ కూర్చహోమం, అథర్వశీర్ష గణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి.

**సాయంత్రం గం|| 6.00ల నుండి రాత్రి గం|| 9.30ల వరకు**

గణపతిపూజ, రాక్షోఘ్నహోమం, సుదర్శన అస్త్ర మంత్ర హోమం, వాస్తుపూజ, సర్వతోభద్ర యంత్రారాధన పూజ, కళశస్థాపన పూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మంగళహారతి.

**తేది 14-04-2015 మంగళవారము ఉదయం గం|| 8.30ల నుండి గం|| 12.30ల వరకు**

గణపతిపూజ,పుణ్యస్థానశుద్ధి హోమము, బింబశుద్ధిహోమం, ప్రాసాదశుద్ధి హోమం, తత్వహోమం, అధివాసహోమం, స్నపనమండలపూజ, బ్రహ్మకళశ స్థాపన పూజ, దిశా హోమం, పూర్ణాహుతి

**సాయంత్రం గం|| 4.30 నుండి గం|| 10.00 ల వరకు**

గణపతిపూజ, ప్రాయశ్చిత్తహోమం, అష్టావధానసేవ, మంగళహారతి
శ్రీరామ, ఆంజనేయ పరివారదేవతామూర్తుల ప్రాకారోత్సవం, ఉత్సవబలి, గ్రామోత్సవం వైభవంగా జరుగును.

**తేది 15-04-2015 బుధవారము ఉదయం గం|| 8.00ల నుండి**

గణపతిపూజ, పుణ్యాహం, స్నపనహోమం, శ్రీ యోగాంజనేయ మూలమంత్ర హోమం, కళావృద్ధి హోమం,వసోర్ధారము ఉ|| గం||11.00లకు "మహా పూర్ణాహుతి" పూర్ణకళాసానిధ్య, బ్రహ్మకళశాభిషేకము, మహాపూజ, మహా మంగళహారతి సామూహిక ప్రార్థన, ఆశీర్వాద గ్రహణము.

ఈ విధముగా 5 దినములు జరుగు కార్యక్రమములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి
శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి
స్వామి వార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

గమనిక : అన్నప్రసాద వితరణ 11-4-2015 నుండి 15-04-2015 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 12.00 గంటల నుండి ప్రారంభం

**శ్రీమతి కలికి శ్రీలత - శ్రీ కలికి కోదండరామిరెడ్డి,** ధర్మకర్తలు

శ్రీ షిర్డి సాయిబాబా మందిరం ట్రస్ట్, కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com